News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 02 | సంచిక :308 | ఖమ్మం | ఆదివారం, డిసెంబర్ 22, 2024 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## నాపై తప్పుడు ప్రచారం జరుగుతోంది

- థియేటర్ దగ్గర రోడ్ షో చేయలేదు
- అభిమాని మరణం నన్నెంతో కలచివేస్తోంది
- లీగల్‌టీం సూచనతోనే బాధిత కుటుంబాన్ని కలవలేకపోయా
- నటుడు అల్లు అర్జున్



"సంధ్య థియేటర్ దగ్గర రోడ్ షో చేశానని నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. థియేటర్‌కు అత్యంత దగ్గరలో ఉన్నప్పుడు ఎక్కువ మంది జనం ఉండటంతో కారు ఆగిపోయింది. దానివల్లే నేను పైకిలేచి చేతులు ఊపాను" అని సినీ నటుడు అల్లు అర్జున్ స్పష్టంచేశారు. "తెలుగు ప్రజల ఖ్యాతి పెంచాలనే ప్రయత్నం చేస్తున్న నాపై తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఇది చాలా బాధాకరం. నా వ్యక్తిత్వ హననం జరుగుతోంది" అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో శనివారం రాత్రి విలేకరులతో ఆయన మాట్లాడారు.

వివరాలు 2లో..



# ప్రాణాలు పోతున్నా.. ఊరుకోవాలా?

- మనిషేనా అసలు? అల్లు అర్జున్ పై రేవంత్ రెడ్డి ఫైర్
- అల్లు అర్జున్‌ను అరెస్టు చేస్తామని హెచ్చరిస్తేనే థియేటర్ నుంచి వెళ్లాడు !
- ఇకపై బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపు ఉండదన్న సీఎం
- సామాన్యుల్ని కష్టపెడితే ఎవర్నీ వదలం
- అసెంబ్లీ వేదికగా సినీ ప్రముఖులకు సీఎం స్పష్టత
- బాలుడిని పరామర్శించకపోవడం సిగ్గుపడాల్సిన విషయమని వ్యాఖ్య
- అరెస్టు వేళ పోలీసులతో హీరో దురుసుగా ప్రవర్తించారని వెల్లడి

వివరాలు 2లో..

## అల్లు అర్జున్ కాలు పోయిందా? కన్ను పోయిందా?

- దేనికి మీ పరామర్శలు.. సినీ ప్రముఖులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్న
- అల్లు అర్జున్ ను ఎందుకు ఓదార్చుతున్నారు?: సినీ ప్రముఖులపై రేవంత్ రెడ్డి ఫైర్
- సంధ్య థియేటర్ ఘటనకు అల్లు అర్జున్ కారణమన్న రేవంత్
- కోమాలో ఉన్న చిన్నారిని ఒక్క సినీ ప్రముఖుడు కూడా పరామర్శించలేదని మండిపాటు
- సినీ నటుడిని అరెస్ట్ చేస్తే రాద్ధాంతం ఎందుకని ప్రశ్న



వివరాలు 2లో..

## జగన్ కు బర్త్ డే విషెస్ చెప్పిన సీఎం చంద్రబాబు



రాజకీయా ల్లో శాశ్వత శత్రువులు ఉండరు అంటా రు.. కానీ, ఏపీ సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లు .. ఇద్దరు ఆగర్భ శత్రువులా అన్న అనుమానం వచ్చేంత రేంజ్ లో రివెంజ్

వివరాలు 2లో..

## సంక్రాంతి తర్వాత రైతు భరోసా డబ్బులు



రైతులకు శుభవార్త చెప్పారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. రైతు భరోసా అమలు విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు వద్దన్నారాయన. రైతు భరోసా అంశంపై అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఈ మేరకు స్పష్టం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో ప్రేమ ఉందన్నారు. భూమి చుట్టూనే రైతు జీవితం, వారి కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు.

వివరాలు 2లో..

## అప్పు మీద చర్చించడానికి ఇప్పటికీ నేను రెడీ

- గత ప్రభుత్వం రూ.6.40 లక్షల కోట్లు అప్పు చేసిందన్న రేవంత్ రెడ్డి
- సీఎం గోబెల్స్ ను మించిపోయారన్న హరీశ్ రావు
- తాము చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లే అని స్పష్టీకరణ



బీఆర్ఎస్ పార్టీ అధికా రంలో ఉన్న పదేళ్లలో రూ.6.40 లక్షల కోట్ల అప్పులు చేశారని ఇవాళ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించడం తెలిసిందే. అప్పులు చేసి కూడా ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని... కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.27 లక్షల కోట్ల అప్పు చేసిందని అంటున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే మేం అప్పులు చేయాల్సి వస్తోందని బీఆర్ఎస్ పై ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో, మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డిపై విమర్శనాస్త్రాలు సంధించారు. అబద్ధాలు చెప్పడంలో ముఖ్యమంత్రి గోబెల్స్ ను మించిపోయాడని అన్నారు. "కాంగ్రెస్ మంత్రులు

వివరాలు 2లో..

## పుష్ప-2 సినిమాతో ఆఖరు... అవన్నీ ఆపేస్తున్నాం

- కిమ్స్ ఆసుపత్రికి వెళ్లిన మంత్రి కోమటిరెడ్డి
- చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ కు పరామర్శ
- అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి
- ఇకపై తెలంగాణలో బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని వెల్లడి



సంధ్య థియేటర్ తొక్కిసలాటలో తీవ్ర గాయాలతో ఆసుపత్రిపాలైన బాలుడు శ్రీతేజ్ ను తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సాయంత్రం పరామర్శించారు. అనంతరం ఆయన ఆసుపత్రి వెలుపల మీడియాతో మాట్లాడారు. పుష్ప-2 ప్రీమియర్ షో చూసేందుకు రేవతి అనే మహిళ తన భర్త, కుమారుడితో శ్రీతేజ్ థియేటర్ వద్దకు వచ్చారని,

వివరాలు 2లో..

## ఉచిత బస్సు పథకం... ఏపీ సర్కార్ కీలక నిర్ణయం!

- మహిళలకు ఉచిత బస్సు పథకంపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
- ముగ్గురు మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు
- రవాణా, మహిళా-శిశు సంక్షేమ, హోం శాఖల మంత్రులు సభ్యులుగా సబ్ కమిటీ

వివరాలు 2లో..




## జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కీలక సూచనలు చేసిన ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల



- 5 శాతానికి మించి జీఎస్టీ శ్లాబులో ఉన్న వస్తువులపై ఒక్క శాతం ఏపీ ఫ్లడ్ సెస్ విధించాలన్న మంత్రి పయ్యావుల కేశవ్
- పేదలకు రేషన్ ద్వారా ఇచ్చే పోర్టిఫైడ్ బియ్యంపై జీఎస్టీ సుంకాన్ని తగ్గించాలన్న పయ్యావుల
- ఇన్నోవేషన్ల ప్రోత్సాహకానికి గానూ రీసెర్చ్ సర్వీసెస్‌కు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలన్న పయ్యావుల

వివరాలు 2లో..

## తెనాలిలో స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేస్తున్నాం

- ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామన్న నాదెండ్ల
- రూ.3 కోట్ల వ్యయంతో నిర్మాణం
- తెనాలి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని వెల్లడి

వివరాలు 2లో..

క్రీడలను ప్రోత్సహిస్తూ తెనాలిలో సువిశాలమైన స్టేడియంను నిర్మించనున్నామని ఏపీ ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. 1.76 ఎకరాల మున్సిపల్ భూమిని




## రైతుభరోసాపై చర్చ

### అసెంబ్లీలో మంత్రి తుమ్మల VS కేటీఆర్





రైతుభరోసాపై అసెంబ్లీలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, మాజీమంత్రి కేటీఆర్ మధ్య హాట్ హాట్ డిస్కషన్ జరిగింది. గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు కూడా రైతు బందు ఇచ్చారన్నారు తుమ్మల నాగేశ్వర్ రావు. రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా మాట్లాడారు. గత 12 సీజన్లలో 80 వేల కోట్ల రైతుబంధు ఇచ్చారని చెప్పారు. ధరణి పోర్టల్ ఆధారంగానే రైతుబంధు ఇచ్చారని..సాగు భూములకు రైతు బంధు

వివరాలు 2లో..

## ఏపీకి తప్పిన ముప్పు.. బలహీనపడిన వాయుగుండం

- తీరం వెంబడి గంటకు 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- ఇంకా అలజడిగానే సముద్రం.. చేపల వేటకు వెళ్లొద్దని జాలర్లకు హెచ్చరిక
- మంగళవారం నుంచి బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు భారీ వర్ష సూచన



వివరాలు 2లో..

# ప్రాణాలు పోతున్నా.. ఊరుకోవాలా?

సినీ హీరో అల్లు అర్జున్ పై శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. అల్లు అర్జున్ మనిషేనా అని ప్రశ్నించిన రేవంత్... ప్రపంచంలో ఇలాంటి మనుషులు కూడా ఉంటారా? అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తొక్కిసలాటలో మహిళ చనిపోయిందని, థియేటర్ బయట పరిస్థితి బాగోలేదని, మీరు ఇక్కడ నుంచి వెంటనే వెళ్లిపోకపోతే పరిస్థితి అదుపుతప్పుతుందని డీసీపీ చెప్పినా... సినిమా చూసి వెళతానని అల్లు అర్జున్ చెప్పారని మండిపడ్డారు. మీరు వెళ్లకపోతే మిమ్మల్ని అరెస్ట్ చేయాల్సి వస్తుందని డీసీపీ హెచ్చరించి, ఆయన ను బలవంతంగా కారులో ఎక్కించారని తెలిపారు. బ యటకు వచ్చిన తర్వాత కూడా అక్కడి నుంచి నేరుగా వెళ్లిపోకుండా... కారు రూఫ్ టాప్ నుంచి బయటకు వచ్చి, చేతులు ఊపుతూ వెళ్లాడని విమర్శించారు. అంత జరిగిన తర్వాత కూడా

చేతులు ఊపుతూ ఉన్నాడంటే ఏమనుకోవాలని ప్రశ్నించారు. ఒక మహిళ మృతికి అల్లు అర్జున్ కారణమని చెప్పారు. ఇకపై సినిమాలకు బెనిఫిట్ షోలు వేసుకోవడానికి, టికెట్ రేట్లను పెంచుకోవడానికి అనుమతించబోమని రేవంత్ స్పష్టం చేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకు బెనిఫిట్ షోలు కుదరవని, టికెట్ ధరల పెంపు ఉండదని అన్నారు.

**అల్లు అర్జున్ కాలు పోయిందా? కన్ను పోయిందా?**

:సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు హీరో అల్లు అర్జున్ కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. థియేటర్ వద్దకు హీరో, హీరోయిన్లు రావద్దని చెప్పినప్పటికీ లెక్క చేయకుండా అల్లు అర్జున్ వచ్చారని తెలిపారు. ఆ సందర్భంగా తొక్కిసలాట చేసుకుని మహిళ మృతి చెందిందని... ఆమె కుమారుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. సంధ్య థియేటర్ ఘటనపై ప్రభుత్వం ప్రకటన చేయాలంటూ ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ శాసనసభలో కోరారు. ఈ క్రమంలో రేవంత్

మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.అసెంబ్లీలో సంధ్య థియేటర్ గురించి మాట్లాడాల్సి వస్తుందని తాను అనుకోలేదని... ప్రస్తుతం ఈ వ్యవహారం దర్యాప్తు దశలో ఉందని... అందువల్ల ఎక్కువగా మాట్లాడటం సరికాదని... దర్యాప్తు అధికారి ఇబ్బంది పడే అవకాశం ఉందని రేవంత్ చెప్పారు. సంధ్య థియేటర్ వద్దకు రావద్దని చెప్పినప్పటికీ అల్లు అర్జున్ వచ్చారని తెలిపారు. ఎక్స్ రోడ్ ముందు నుంచే రోడ్ షో చేసుకుంటూ కారు రూఫ్ టాప్ నుంచి చేతులు ఊపుతూ వచ్చారని... ఆ సమయంలో అభిమానులు వేల సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగిందని చెప్పారు. ఈ ఘటనలో రేవతి చనిపోయారని, ఆమె కుమారుడికి బ్రెయిన్ డ్యామేజ్ అయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అల్లు అర్జున్ ర్యాలీగా వెళ్లడం వల్లే తొక్కిసలాట జరిగిందని రేవంత్ చెప్పారు. 20 రోజులుగా ఆసుపత్రిలో చిన్నారి కోమాలో ఉంటే ఇంత వరకు

ఒక్క సినీ ప్రముఖుడు కూడా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించలేదని రేవంత్ విమర్శించారు. అల్లు అర్జున్ కు కన్ను పోయిందా? కాలు పోయిందా? ఎందుకు అందరూ ఆయన దగ్గరకు వెళ్లి ఓదారుస్తున్నారని మండిపడ్డారు. ఒక సినీ నటుడిని అరెస్ట్ చేస్తే ఇంత రాద్ధాంతం ఎందుకు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నాపై తప్పుడు ప్రచారం జరుగుతోంది

- మొదటి పేజి తరువాయి

"అనుమతి లేకున్నా సంధ్య థియేటర్ దగ్గరికి వెళ్లానన్నది పూర్తిగా అబద్ధం. థియేటర్ యాజమాన్యం వారు అనుమతి తీసుకున్నట్లు చెబితేనే నేను అక్కడికి వెళ్లా. పోలీసు అధికారులు సూచించిన డైరెక్షన్‌లోనే వెళ్లా. వారే జనాన్ని క్లియర్ చేస్తుంటే అనుమతి ఉందనుకొని ముందుకెళ్లాను. వేల మంది జనం పూర్తిగా నా కారుకు దగ్గరగా వచ్చారు. ఒక్కసారి కనిపిస్తే గానీ... వారక్కడి నుంచి వెళ్లరని అలా చేశా. అంతమంది వచ్చినప్పుడు కారులోనే కూర్చుంటే ఎలా ఉంటుంది? థియేటర్‌లోకి వెళ్లి కూర్చుంటే ఏ పోలీసు అధికారీ... నా దగ్గరకు వచ్చి జరిగిన దుర్ఘటన గురించి చెప్పలేదు. నా మేనేజ్‌మెంట్ టీం వచ్చి బయట ఎక్కువ మంది ఉన్నారని, థియేటర్ నుంచి వెళ్లిపోవాలని సూచించింది.

వారు చెప్పగానే నేను అక్కడి నుంచి వెళ్లిపోయా. అక్కడ ఓ మహిళ మరణించినట్లు, బాలుడు ఆసుపత్రి పాలైనట్లు నాకు తర్వాతి రోజు తెలిసింది. దీంతో దిగ్భ్రాంతికి గురయ్యా. బయట ఆ దుర్ఘటన జరిగిందని తెలిసి కూడా నేను అలాగే సినిమా చూస్తున్నానని ప్రచారం చేస్తోంటే బాధగా ఉంది. ఆ సంఘటన గురించి మరుసటి రోజు తెలిసిన వెంటనే బన్నీవాసుకు ఫోన్ చేసి ఆసుపత్రికి వెళ్లాలని సూచించా. నేను కూడా వస్తానంటే వద్దన్నారు. పరిస్థితి గందరగోళంగా ఉందన్నారు. నాపై కేసు పెట్టారని, కలవడానికి వీల్లేదని నా లీగల్ టీం కూడా చెప్పింది. అందుకే అక్కడికి వెళ్లలేక పోయా" అని అల్లు అర్జున్ స్పష్టంచేశారు.

**ఇతర నటుల అభిమానులు చనిపోతేనే వెళ్లినవాణ్ని**

"చిరంజీవి, పవన్‌కల్యాణ్‌ల అభిమానులు చనిపోతే ఆయా బాధిత కుటుంబ సభ్యుల్ని పరామర్శించా. అలాంటిది నా అభిమాని మరణిస్తే కలవాలని నాకు ఉండదా? నేను వెళ్లడానికి లీగల్‌గా కుదరదన్నారు కాబట్టే వెళ్లలేదు. సినిమాకు సంబంధించిన అన్నిరకాల సక్సెస్ మీట్లను రద్దు చేసుకున్నాం. నా తండ్రిని ఆసుపత్రికి వెళ్లాలని చెప్పా. నాకు సంబంధించిన వాళ్లను కూడా రేవతి కుటుంబాన్ని పరామర్శించాలని సూచించా. రేవతి కుటుంబాన్ని నేను పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని మాట్లాడే క్రమంలో అల్లు అర్జున్ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.

ప్రభుత్వాన్ని తప్పుబట్టడం లేదు

"నేను ఎవర్నీ నిందించడానికి ప్రెస్‌మీట్ పెట్టలేదు. తప్పుబట్టడం లేదు. ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరించింది. పోలీసులు కూడా అక్కడ చాలా కష్టపడ్డారు. నాతో ఓ పోలీసు అధికారి మాట్లాడారు. 'ఎన్నో కార్యక్రమాలకు బందోబస్తు చేశాం కానీ ఇక్కడ ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరం' అని చెప్పారు. ఈ బాధాకరమైన సందర్భంలో నాకు పూర్తిగా గందరగోళంగా ఉంది. సినిమా విజయం సాధించిన ఆనందమే లేదు" అని ఆవేదన వ్యక్తంచేశారు.

**థియేటర్‌కు వచ్చిన వాళ్లు సంతోషంగా ఉండాలనుకుంటా...**

"సినిమా థియేటర్ నాకు దేవాలయం లాంటిది. అలాంటి ప్రదేశంలో ఈ సంఘటన జరగడం దురదృష్టకరం. థియేటర్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ సంతోషపరచాలనేదే నా ప్రయత్నం. మూడేళ్లు కష్టపడి తీసిన సినిమా ఎలా వచ్చిందో... ప్రేక్షకులు, అభిమానుల స్పందన ఎలా ఉందో తెలుసుకోవడానికి నేనే సంధ్య థియేటర్‌కు వెళ్లా. ప్రతి సినిమా విడుదలకు అక్కడికి వెళ్తా. కానీ, ఎప్పుడూ ఇలా జరగలేదు. ఎప్పటికప్పుడు శ్రీతేజ్ ఆరోగ్య సమాచారం తెలుసుకుంటున్నా. నాకు కూడా శ్రీతేజ్ వయసు పిల్లలున్నారు. శ్రీతేజ్ కోలుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. నిర్మాణ సంస్థ, దర్శకుడు సుకుమార్‌లతో కలిసి రేవతి కుటుంబానికి పెద్ద మొత్తంలో సాయం చేయాలనుకుంటున్నాం" అని అల్లు అర్జున్ వెల్లడించారు.

**తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు: అల్లు అరవింద్**

అనంతరం అల్లు అరవింద్ మాట్లాడుతూ... "భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన సినిమా ఎలా వచ్చిందో చూసుకోవాలని అల్లు అర్జున్ థియేటర్‌కు వెళ్లాడు. ఊహించని దురదృష్టకర ఘటన జరిగింది. అప్పటి నుంచి బన్నీ చాలా మనోవేదనకు గురవుతున్నాడు. మా ఇంట్లో ఒక మూలన కూర్చుని తీవ్ర ఆలోచనలో ఉన్నాడు. అభిమాని కుటుంబం ఇలా అయిపోయిందేమిటని కుమిలిపోతున్నాడు. తండ్రిగా నా కడుపు తరుక్కుపోతోంది. అర్జున్‌కు వచ్చిన పేరు ఒక రాత్రి, ఒక సినిమాతో వచ్చింది కాదు. ఎంతో కష్టపడ్డాడు. గత మూడు తరాలుగా మా కుటుంబం గురించి మీకు తెలుసు. ఎప్పుడైనా ఇలా వ్యవహరించామా? మాపై అసత్య ప్రచారం చేస్తుంటే బాధగా ఉంది. అందుకే మీ ముందుకు వచ్చాం. ప్రజలు ఆదరిస్తేనే పైకి వచ్చిన కుటుంబం మాది. ఆ అభిమానాన్ని ఇలాగే కొనసాగించాలని కోరుతున్నాం. మైత్రీ మూవీస్, డైరెక్టర్ కలిసి బాధిత కుటుంబానికి కొంత మొత్తాన్ని ఇవ్వాలనుకుంటున్నారు. ఆ విషయాలు త్వరలోనే చెబుతారు. మీడియా ప్రశ్నలు తీసుకోవద్దని లీగల్ టీం చెప్పడంతోనే మీరు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోతున్నాం" అని వివరించారు.

# జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కీలక సూచనలు చేసిన ఏపీ ఆర్ధికమంత్రి పయ్యావుల

జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కీలక సూచనలు చేశారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో శనివారం 55 వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఏపీకి సంబంధించిన వివిధ అంశాలపై ప్రస్తావించారు. కీలక రంగాలకు సంబంధించి జీఎస్టీ విధానంలో తేవాల్సిన మార్పు చేర్పులపై పయ్యావుల కీలక సూచనలు చేశారు. 5 శాతానికి మించి జీఎస్టీ శ్లాబులో ఉన్న వస్తువులపై రాష్ట్రంలో జరిగే రవాణాపై ఒక్క శాతం ఏపీ ఫ్లడ్ సెస్ విధించాలని సూచించారు. దీని వల్ల పేదలు, మధ్య తరగతి ప్రజలపై ఎలాంటి ప్రభావం ఉండదన్నారు. ఈ సెస్ ద్వారా ఏపీలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస చర్యలు చేపడతామని చెప్పారు. 2018లో కేరళ వరదల సమయంలో ఇదే తరహా సెస్ విధించిన విషయాన్ని పయ్యావుల గుర్తు చేశారు. ఇన్నోవేషన్‌లకు ప్రోత్సాహమిచ్చేలా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నిర్వహించే రీసెర్చ్ సర్వీసెస్‌కు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. పేదలకు రేషన్ ద్వారా ఇచ్చే ఫోర్టిఫైడ్ బియ్యంపై జీఎస్టీ సుంకాన్ని తగ్గించాలన్నారు. ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ వ్యవస్థను మరింత పారదర్శకంగా చేపట్టాలని, రాష్ట్రాలకు కూడా డేటా అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో భాగంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్లను మరింత సులభతరం చేసేందుకు టెక్నాలజీని వినియోగించుకోవాలని, అలాగే బోగస్ రిజిస్ట్రేషన్లను అరికట్టాలని తెలిపారు.

చిన్న వ్యాపారస్తులు.. కంపోజిషన్ జీఎస్టీ చెల్లింపు దారులకు అద్దెల విషయంలో విధించే రివర్స్ ఛార్జ్ మెకానిజం (ఆర్సీఎం) నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. కీలకాంశాలపై ఏపీ సీఎం చంద్రబాబు తీసుకుంటున్న చొరవను జీఎస్టీ కౌన్సిల్లో పయ్యావుల ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రానికి ఏం కావాలో వివరిస్తూనే .. వివిధ రంగాల్లో జీఎస్టీ కౌన్సిల్ అనుసరించాల్సిన విధానాలకు సంబంధించి పయ్యావుల ఇచ్చిన కీ నోట్ ప్రసంగానికి ఇతర రాష్ట్రాల ఆర్థిక శాఖ మంత్రులు ప్రశంసించారు.

ఏపీతో సహా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సూచనలను పరిశీలించేందుకు జీఎస్టీ కౌన్సిల్.. క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. తాను చేసిన సూచనలపై వెంటనే కేబినెట్ సబ్ కమిటీ వేసినందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పయ్యావుల ధన్యవాదాలు తెలిపారు. మంత్రి పయ్యావుల కేశవ్ వెంట జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఏపీ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, కమర్షియల్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు పాల్గొన్నారు.

## తెనాలిలో స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

సేకరించి రూ. 3 కోట్ల అంచనాతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని వెల్లడించారు. అందులోనే వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులతో పాటు స్విమ్మింగ్ పూల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.పట్టణ అభివృద్ధి కోసం మంచి ప్రణాళిక సిద్ధం చేయబోతున్నామని తెలిపారు. ప్రధాన రహదారుల విస్తరణ, మెరుగైన వైద్య సదుపాయాలు, రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా, తెనాలి కళాకారుల సంస్కృతి తదితర అంశాలను ప్రాథమికంగా తీసుకుని తెనాలి పట్టణాన్ని అభివృద్ధి నిర్మాణంలో నడిపిస్తామని నాదెండ్ల వివరించారు. తెనాలి పట్టణ పరిధిలో రోడ్ల విస్తరణతో పాటు నిఘా కెమెరాలు ఏర్పాటుపై పరిశీలిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇందులో భాగంగా తెనాలి-కొల్లిపర సీసీ రోడ్లు అభివృద్ధి చేయబోతున్నామన్నారు. రూ 20 లక్షలతో చినారావూరు పార్క్ ను మరమ్మత్తులు చేపట్టి డిసెంబర్ 30 నాటికి సుందరీకరణ చేయబోతున్నామని, రూ 1.15 కోట్లతో తెనాలి ఐతానగర్ లో ఐకర్స్ పార్క్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. సంక్రాంతి పండగలోపు దుగ్గిరాల, మంగళగిరి రోడ్డు మరమ్మత్తులు పూర్తి చేస్తామని చెప్పారు.

## పుష్ప-2 సినిమాతో ఆఖరు... అవన్నీ ఆపేస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

అదే సమయంలో అల్లు అర్జున్ రావడంతో ఆయనను చూసేందుకు జనం ఎగబడ్డారని కోమటిరెడ్డి వెల్లడించారు.ఈ తొక్కిసలాటలో రేవతి, అమె కుమారుడు కిందపడిపోయారని... రేవతి మృతి చెందగా, శ్రీతేజ్ బాగా దెబ్బలు తగిలాయని వివరించారు. ఇంత జరిగినా హీరో గానీ, నిర్మాత గానీ ఏమీ పట్టించుకోకుండా వెళ్లి థియేటర్ బాల్కనీలో కూర్చుని సినిమా చూశారని కోమటిరెడ్డి ఆరోపించారు. థియేటర్ బయట పరిస్థితి ఏమీ బాగా లేదు సార్...

మీరు వెళ్లిపోండి అని ఏసీపీ చెప్పినా వినిపించుకోకపోవడంతో, డీసీపీ వెళ్లి గట్టిగా మందలింపు ధోరణితో చెప్పాల్సి వచ్చిందని అన్నారు. అయినప్పటికీ, సినిమా అయిపోయే దాకా చూసి, మళ్లీ వాహనం రూఫ్ టాప్ నుంచి చెయ్యి ఊపుకుంటూ వెళ్లారని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. "అక్కడ రేవతి, ఆమె బిడ్డ పరిస్థితి గురించి సినిమా వాళ్లు ఎవరూ పట్టించుకోలేదు. సినిమా చూడ్డానికి వచ్చిన వాళ్లు స్పందించడంతో, ఆమెను, ఆమె కొడుకును ఆసుపత్రికి తరలించారు. రేవతి చనిపోయింది. ఆమె కొడుకు చికిత్స పొందుతున్నాడు. ఇవాళ ఆ బిడ్డను చూసేందుకు ఆసుపత్రికి వచ్చాను. డాక్టర్లతోనూ, ఆసుపత్రి యాజమాన్యంతోనూ మాట్లాడాను. వెంటిలేటర్ తీసేసి, గొంతు వద్ద రంధ్రం చేసి శ్వాస అందిస్తున్నారు. పైపుల ద్వారా ఆహారం అందిస్తున్నారు... అబ్బాయి చాలా బలహీనంగా ఉన్నాడు. మృతి చెందిన రేవతికి ఆత్మశాంతి కలగాలని, ఆమె కుమారుడు త్వరగా కోలుకోవాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను. ఆ రోజున పోలీసుల అనుమతి లేకుండానే చిత్రబృందం థియేటర్ వద్దకు వచ్చింది. హీరో కాన్వాయ్ తో పాటు అనేకమంది బౌన్సర్లు థియేటర్ వద్దకు వచ్చారు. ప్రేక్షకులను బౌన్సర్లు నెట్టివేశారు. ఇక మీదట సినిమాల ప్రీమియర్ షోలకు అనుమతిచ్చే విషయంపై సమీక్ష చేపడతాం. ఎంత బడ్జెట్ పెట్టి సినిమా తీసినా, టికెట్ల రేట్లు పెంచుకోవడంపై ఆచితూచి నిర్ణయం తీసుకుంటాం.

దేశ స్వాతంత్ర్యానికి సంబంధించిందా? లేక, తెలంగాణ ఉద్యమానికి సంబంధించిందా? లేకపోతే, డ్రగ్స్ మీద, ఇతర సమస్యల మీద ప్రజలకు సందేశం ఇచ్చే సినిమానా? అనే విషయాలు ఆలోచించి,

అది కూడా నామమాత్రంగానే టికెట్ రేట్లు పెంచుకునేందుకు అనుమతిస్తాం. బెనిఫిట్ షోలకు అనుమతించే ప్రశ్నే లేదు. ఇలాంటివన్నీ పుష్ప-2తోనే ఆపేస్తున్నాం. పుష్ప-2 చిత్రం బాగుంటే అందరూ చూడండి... నేను కూడా చూశాను. ఇకపై దేవుళ్ల సినిమాలు, చరిత్రకు సంబంధించిన సినిమాలు, రాజుల సినిమాలు, తెలంగాణ ఉద్యమ సినిమాలు తప్ప ఇతర తెలుగు సినిమాలు చూడదలచుకోలేదు. ఎందుకంటే... మూడున్నర గంటలు ఉండే సినిమా చూసే బదులు చాలా పనులు చేసుకోవచ్చు. ఆ సినిమా చూసిన తర్వాత మన యువకులు కూడా చెడిపోతారు" అని మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

## అప్పు మీద చర్చించడానికి ఇప్పటికీ నేను రెడీ

- మొదటి పేజి తరువాయి

ఒక్కరూ సరైన మాట మాట్లాడరు... జూపల్లి రూ.8 లక్షల కోట్లు అంటాడు, ముఖ్యమంత్రేమో రూ.6 లక్షల కోట్లు అంటాడు... ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రేమో ఒకరోజు రూ.7.11 లక్షల కోట్లు అంటారు, మరుసటిరోజు అసెంబ్లీకి వచ్చి రూ.6.70 లక్షల కోట్లు అంటారు... అసలు కథ ఏంటంటే... ఆ అప్పు రూ.4.17 లక్షల కోట్లు మాత్రమే. ఇదే మాట నిన్న నేను అసెంబ్లీలో కూడా చెప్పాను. అప్పు ఉన్నది రూ.4.17 లక్షల కోట్లే... ఇది తప్పు అయితే, ఎలా తప్పో చెప్పండి అని నిలదీస్తే... డిప్యూటీ సీఎం నోరు విప్పకుండా తలదించుకుని సభ నుంచి వెళ్లిపోయారు. ఇప్పుడు కూడా అప్పు మీద చర్చించడానికి నేను రెడీ" అంటూ కాంగ్రెస్ సర్కారుకు సవాల్ విసిరారు.

## రైతులకు గుడ్ న్యూస్.. సంక్రాంతి తర్వాత రైతు భరోసా డబ్బులు

- మొదటి పేజి తరువాయి

భూమినే నమ్ముకుని.. భూమినే అమ్మగా భావించి జీవనాధారం సాగిస్తున్నారన్నారు సీఎం రేవంత్ రెడ్డి. పెట్టుబడి సాయం కింద రైతును ఆదుకోవాలనే ఉద్దేశంతోనే రైతు భరోసా తెస్తున్నామన్నారు.గత ప్రభుత్వం.. బీఆర్ఎస్ పార్టీ హయాంలో... సాగులో లేని భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, రాళ్లు, రప్పలు, జాతీయ రహదారుల కింద పోయిన భూములు.. పరిశ్రమల్లోని భూములు ఇలాంటి వాటన్నింటికీ రైతు బంధు కింద.. అనర్హులకు కూడా డబ్బులు ఇచ్చారన్నారు. కేసీఆర్ హయాంలో 72 వేల కోట్లు రైతు బంధు కింద చెల్లిస్తే.. అందులో 22 వేల 606 కోట్ల రూపాయలు అనర్హులకే చెల్లించారన్నారు. ఈ 22 వేల 606 కోట్ల రూపాయలు బీఆర్ఎస్ పార్టీ నేతలు దోచుకున్నారన్నారు. ఇలాంటి తప్పిదాలు అన్నింటినీ సవరించి.. కొత్త విధానాలు రూపొందించి.. అర్హులకే రైతు బంధు సాయం అందించే విధంగా ప్రణాళిక రచిస్తున్నామన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత.. 2025 జనవరి నెలలో కొత్త విధివిధానాలతో రైతు బంధు నిధులు విడుదల చేస్తామన్నారు. నిజమైన రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. హైదరాబాద్ లో అసలు వ్యవసాయమే లేదని.. ఇలాంటి హైదరాబాద్ సిటీలోనూ రైతు బంధు కింద డబ్బులు దోచుకుని తిన్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్ రెడ్డి.

## జగన్ కు బర్త్ డే విషెస్ చెప్పిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

పాలిటిక్స్ నడుపుతుంటారు. అంతటి రాజకీయ వైరం ఉన్న ఇద్దరు ఒకరికొకరు విష్ చేసుకోవడం చాలా రేర్. కానీ.. రాజకీయ వైరాన్ని పక్కన పెట్టి జగన్ బర్త్ డే విషెస్ చెప్పారు సీఎం చంద్రబాబు. (డిసెంబర్ 21, 2024 ) పుట్టిన రోజు జరుపుకుంటున్న జగన్‌కు ట్విట్టర్ వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు సీఎం చంద్రబాబు.వైఎస్ జగన్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మంచి ఆరోగ్యంతో దీర్ఘాయువు పొందాలని కోరుకుంటున్నానంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు చంద్రబాబు. కాగా.. జగన్ పుట్టినరోజు సందర్భంగా ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున సెలెబ్రేషన్స్ చేస్తున్నారు. కేక్ కటింగ్ కార్యక్రమాలు, అన్నదానాలతో జగన్ పట్ల తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా జగన్‌కు బర్త్ డే విషెస్ తెలిపారు. ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం ప్రజాసేవలో కొనసాగాలని కోరుకుంటున్నట్టు ఆయన తెలిపారు. వైసీపీ కీలక నేత విజయసాయి రెడ్డి కూడా సోషల్ మీడియాలో జగన్‌కు బర్త్‌డే విషెస్ చెప్పారు.

## రైతుభరోసాపై చర్చ

- మొదటి పేజి తరువాయి

అందలేదన్నారు తుమ్మల. రైతు బంధు లోపాలు సరిదిద్ది రైతుభరోసా ఇస్తామన్నారు తుమ్మల నాగేశ్వర్ రావు. 21,082 కోట్లు వృథా అయ్యాయని ఆరోపించారు.సాగు భూములకే రైతు బంధు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు మంత్రి తుమ్మల. రైతు భరోసా అమలుపై ప్రభుత్వం సబ్ కమిటీ నియమించిందని చెప్పారు. సంక్రాంతి లోపే రైతుభరోసాపై విధివిధానాలు రూపొందించి రైతుబందు ఇస్తామన్నారు. రైతుభరోసాపై అన్ని వర్గాల నుంచి అభిప్రాయాన్ని సేకరించామని చెప్పారు. రైతుభరోసాపై ప్రతిపక్షాలు విలువైన సూచనలు ఇవ్వాలని కోరారు. సంక్రాంతి నుంచి రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించామన్నారు.తుమ్మల వ్యాఖ్యలపై మాట్లాడిన కేటీఆర్.. తాము నాలుగున్నర లక్షల ఎకరాలకు పోడు పట్టాలిచ్చామన్నారు కేటీఆర్. రూ21 వేల రైతు బంధు వృథా అనేది అవాస్తవమన్నారు.రైతుబంధుతోనే సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. పత్తి రైతులకు ఒక పంటకు రైతుబంధు ఇస్తారా రెండు పంటలకు ఇస్తారా? పోడు పట్టాలున్న రైతులకు రైతుబంధు ఇస్తారా?ఇవ్వరా. కంది సాగు చేసిన రైతులకు రైతుబంధు ఇస్తారా? హర్టికల్చర్ రైతులకు రైతుబంధు ఇస్తారా? ఎన్ని పంటలకు..ఏయే పంటలకు రైతుబంధు ఇస్తారో చెప్పాలి. బీఆర్ఎస్ హయాంలో రైతు ఆత్మహత్యలు తగ్గాయని కేటీఆర్ అన్నారు. అయితే వెంటనే కల్గజేసుకున్న మంత్రి తుమ్మల .. రైతుభరోసాపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఏ పంటకు ఎంత ఇవ్వాలో సూచనలు ఇస్తే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటదని చెప్పారు.

## ఉచిత బస్సు పథకం... ఏపీ సర్కార్ కీలక నిర్ణయం!

ఏపీ ఎన్నికల సమయంలో ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఒకటి. దాంతో ఈ స్కీమ్ అమలు ఎప్పుడెప్పుడా అని మహిళలు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకం అమలు తీరుతెన్నుల పరిశీలనకై ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ముగ్గురు మంత్రులతో ఈ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. రవాణా, మహిళా-శిశు సంక్షేమ, హోం శాఖల మంత్రులు ఇందులో సభ్యులుగా ఉంటారని తెలిపింది. ఇతర రాష్ట్రాల్లో ఈ పథకం ఎలా అమలు అవుతోంది, అక్కడి విధివిధానాలు, ఏపీలో ఎలా అమలు చేస్తే బాగుంటుంది తదితర విషయాలపై మంత్రుల కమిటీ వీలైనంత త్వరగా నివేదికను, సూచనలను ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగింది. సబ్ కమిటీ నివేదిక ఆధారంగా ఏపీలో ఈ పథకం అమలు కానుంది.

## ఏపీకి తప్పిన ముప్పు.. బలహీనపడిన వాయుగుండం

ఆంధ్రప్రదేశ్‌కు వాయుగుండం ముప్పు తప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శనివారం తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. దీని ప్రభావంతో రేపటి వరకు తీరం వెంబడి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణశాఖ తెలిపింది. అలాగే, వచ్చే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సముద్రం ఇంకా అలజడిగానే ఉండడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీచేసింది.

వాయుగుండం ప్రభావంతో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నిన్న కూడా భారీ వర్షాలు కురిశాయి. మరోవైపు, మంగళవారం నుంచి బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది.

## ఎటపాక మండలం పురుషోత్తపట్నం లో ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు.

- గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి.



**సీ కే ఎటపాక ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 21,** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి వర్యులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైయస్ జగన్మోహన్ రెడ్డి బర్త్ డే సందర్భంగా, ఎటపాక మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు, అన్ని పంచాయతీల నుంచి, పురుషోత్తపట్నం లో వైఎస్ఆర్ విగ్రహం వద్ద, ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం భారీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానుల మధ్య, కేరింతలతో ఎంతో ఉత్సాహంగా, భారీ కేకును కట్ చేయడం జరిగింది. అనంతరం అందరూ కలిసి భద్రాచలం నందు గల నన్నపనేని మోహన్ జడ్పీ హైస్కూల్లో పేద పిల్లలకి నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, జామెంట్రీ బాక్సులు, పంచారు. ఈ కార్యక్రమంలో ఎటపాక ఎంపీపీ కాకా కామేశ్వరి, స్థానిక సర్పంచ్ బుద్ధ ఆదినారాయణ, స్థానిక ఎంపీటీసీ, గొంగడి వెంకటరామిరెడ్డి, రాయనపేట ఎంపీటీసీ, సోయం వెంకటరమణ, నెల్లిపాక ఎంపీటీసీ, బూరం అంజలి, పార్టీ జిల్లా కార్యదర్శి, దామెర్ల రేవతి, ఉప సర్పంచ్, తోట శశి కుమార్, మాజీ సొసైటీ చైర్మన్, ఆకుల వెంకటరమణ, మర్మం శంకర్, అన్నెం జయచంద్రారెడ్డి, భోగాల వీరారెడ్డి, కుందూరు రామిరెడ్డి, సా రెడ్డి పెద్ద శ్రీనివాస్ రెడ్డి, బా రెడ్డి లక్ష్మారెడ్డి, ప్రగల్ల రమేష్, కమ్మీల రామ్మోహన్రావు, మద్దెల రాముడు, నూతలపాటి బాలస్వామి, ఆకుల కామేష్, దామెర్ల దుర్గయ్య, రాజారావు, ముత్తి బోయిన రాము, కాకాని సురేష్, ముక్కా శీను, యేసుపాక వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, కోడూరి నవీన్ కుమార్ కొప్పుల వెంకటేశ్వరరావు కన్నాయిగూడెం మణి, దుద్దుకూరు వెంకటేశ్వరరావు, నూతనపాటి రామారావు, వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వేమిరెడ్డి పండు, బాసిరెడ్డి సుబ్బమ్మ, అన్నెం నాగమణి, అన్నెం మంగమ్మ, అన్నెం లక్ష్మి, కర్ణ లక్ష్మి, సోము సీతమ్మ, గొంగడి సీతమ్మ. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


## మేడపాటి రవీంద్రారెడ్డి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన పల్లి శ్రీనివాసులునాయుడు



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) డిసెంబర్ 21:** విశాఖ పార్లమెంట్ బిజెపి జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్రారెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో దుశాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర బిజెపి ఓబీసీ ఉపాధ్యక్షులు. ఏపీ జె యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లి శ్రీనివాసులునాయుడు. ఈ సందర్భంగా రవీంద్ర రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు. ప్రజలను ఎంతగానో అకరిచితులు అవుతున్నారని కొనియాడారు అలానే బిజెపి సభ్యత్వ నమోదులో రెండు రాష్ట్రలో సుమారుగా రెండు లక్షలు పైగా చేయించిన ఘనంత కూడా మీకే దకిందని కొనియాడారు. మీరు ఇంకా ఉన్నత మైన పదవులు అధిరోహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ ఎస్ సి సెల్ అధ్యక్షులు బట్టు ఆనందకుమారు. కె జి హెస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఉతరాంధ్ర బీసీ సంగం అధ్యక్షులు పి వెంకటేశ్వరావు. బిజెపి ఓబీసీ సోషల్ మీడియా కన్వినర్ పి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చేసిన వాక్యాలకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించిన కాంగ్రెస్ నాయకులు

- అంబేద్కర్ పట్ల వ్యాఖ్యలు చేసిన అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి



**సి కె న్యూస్ బూర్గంపహాడ్, డిసెంబర్ 20,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ప్రధాన కూడలిలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వ హెూం మంత్రి అమిత్ షా రాజ్యసభలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి ఆద్వర్యంలో నల్ల బ్యాడ్జీలు దరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. బూర్గంపహాడ్ ప్రదాన కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ మనువాద భావజాలం కలిగిన మతతత్వ బీజేపీ నాయకులు భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల చేసిన వ్యాఖ్యలపై అదే రాజ్యసభ వేదికగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు తాళ్లూరి చక్రవర్తి, జిల్లా నాయకులు చల్లా వెంకట్ నారాయణ, నియోజకవర్గ నాయకులు కణితి కృష్ణ, పినపాక నియోజకవర్గ యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ తలకోల శీరీషారెడ్డి, మండల యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కన్నేపల్లి శివ, నాయకులు కావటం వెంకట్రామిరెడ్డి,తిరుపతి చంటి, వీరారెడ్డి, కన్నేపల్లి బేబి, తేజావత్ దేవీ, నాగిరెడ్డి, మాధవరెడ్డి, చోటే, బిహారీ, పాషా, దేగల తిరుమల రావు, కేసుపాక మహేష్, పుట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నావికాదళ విన్యాసాల నిర్వహణలో సమన్వయంతో వ్యవహరించాలి

**నేవీ, జిల్లా అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించిన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**సి కె న్యూస్ విశాఖపట్టణం ప్రతినిధి ( రవికుమార్ ) డిసెంబర్ 21 :** జనవరి 04వ తేదీన విశాఖపట్టణం ఆర్కే బీచ్ పరిధిలో జరగనున్న నావికాదళ విన్యాసాల నిర్వహణలో అందరూ సమన్వయంతో వ్యవహరించాలని. విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఇండియన్ నేవీ, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ కమిషనర్లతో కలిసి శనివారం ఉదయం ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. విశ్వప్రియ హాలు, ఆర్కే బీచ్ పరిసర ప్రాంతాల్లో పలు చోట్ల తిరిగిన ఆయన అక్కడ పరిస్థితులపై సమీక్షించారు. విన్యాసాలకు సంబంధించే అన్ని రకాల క్రతువుల గురించి నేవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన వేదిక నిర్మాణం, ఫైర్ వర్క్, లేజర్ షో, డ్రోన్ షోల నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై ఆరా తీశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు భాగస్వామ్యం కానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతాపరమైన చర్యలు కూడా తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ను భర్తరఫ్ చేయాలి.




- రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల.
- కొత్వాల నాయకత్వంలో పాల్వంచలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 21,** భారత రాజ్యాంగ నిర్మాత, పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర హెూం శాఖా మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను యావత్ భారతదేశం ప్రజలు ఖండిస్తున్నారని, అమిత్ షా ను కేంద్ర మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని లిరాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.

అమిత్ షా భారతరత్న అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో కొత్వాల నాయకత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు బ్లాక్ బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి కేంద్ర మంత్రి అయిన అమిత్ షా, అంబేద్కర్ పై వ్యాఖ్యానించడం సిగ్గుచేటు అని అన్నారు. అంబేద్కర్ ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి అని, ఆయన యావత్ భారత దేశ ప్రజలకు ఆరాధ్యుడు అని కొత్వాల అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రం పరిగణించి, అమిత్ షా ను కేంద్ర మంత్రివర్గం నుండి వెంటనే భర్తరఫ్ చేయాలని కొత్వాల డిమాండ్ చేశారు. తక్షణమే అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేనిచో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని కొత్వాల వెల్లడించారు.

ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు జాలే జానకిరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, మహీపతి రామలింగం, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కాల్వ భాస్కర రావు, బద్ది కిషోర్, ఎస్ వి ఆర్ కె ఆచార్యులు, కనగాల నారాయణరావు, బాలినేని నాగేశ్వరరావు, వై వెంకటేశ్వర్లు, జమ్ముల సీతారాంరెడ్డి, కాపర్తి వెంకటాచారి, చింతా నాగరాజు, కాపా శ్రీను, వాసుమల్ల సుందర్ రావు, కందుకూరి రాము, చాంద్ పాషా, దారా చిరంజీవి, పైడిపల్లి మహేష్, బాశబోయిన అశోక్, ఉండేటి శాంతివర్ధన్, కటుకూరి శేఖర్, భూక్యా గిరి ప్రసాద్, కొత్తపల్లి రవి, వీరమల్ల గణేష్, బండి నాగరాజు, సత్తార్, కొండలరావు, నగేష్, రాము, నల్లమల్ల సత్యం, ఏలూరి రామారావులి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి చేసాం.... బిల్లులు చెల్లించండి మహాప్రభో...

మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి..



**సికె న్యూస్, పినపాక నియోజకవర్గం డిసెంబర్ 21,** అశ్వాపురం : మొండికుంట గ్రామ పంచాయతీలో గ్రామ పంచాయతీ నిధులతో ప్రజల కోరిక మేరకు మట్టి రోడ్లను సీసీ రోడ్లగా నిర్మాణం చేసి ఎంబి రికార్డు అయి ఏడాదిన్నర అవుతున్నా ప్రభుత్వం నిధులు ఇవ్వక గ్రామ పంచాయతీ ఈ రోజు వరకు బిల్లులు చెల్లించడం లేదు.గ్రామ పంచాయతీ లో రోడ్డు నిర్మాణం జరిగినపుడు బిల్లులు తీసుకుందామనుకుంటే గ్రామ పంచాయతీలో సాధారణ పరిపాలన నిధులు ఉండాలని ఆ రోజు బిల్లులు తీసుకోలేదు.ఈ రోజు బిల్లులు ఇవ్వడం లేదు.అలాగే గ్రామ పంచాయతీ లో ఎస్ డి ఎఫ్ కింద 60 లక్షలతో మట్టి రోడ్లను సీసీ రోడ్లగా వేసి గ్రామాన్ని అభివృద్ధి చేస్తే అప్పటి ప్రభుత్వం సాధారణ ఎన్నికల కోడ్ వలన బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నూతన ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా బిల్లులు చెల్లించక పోవడం దురదృష్టకరం. గ్రామాల్లో చేసిన అభివృద్ధి ప్రభుత్వానికి కనుబడుటలేదా అని అగ్రహం వ్యక్తం చేశారు. సత్వరమే గ్రామ పంచాయతీ బిల్లులు ఎస్ డి ఎఫ్ బిల్లులు చెల్లించాలని కూర్చున్నారు

## చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ

- అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నదానం చేసిన తాడిశెట్టి నవీన్
- అన్నదానానికి 5 వేల రూపాయలు విరాళం అందజేసిన కే శ్రీనివాస్ లావణ్య దంపతులు





**సి కే న్యూస్ షాద్ నగర్ :డిసెంబర్ 21:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. షాద్నగర్ పట్టణానికి చెందిన తాడిశెట్టి నవీన్ కుమార్, వారి కుటుంబ సభ్యులు దేవాలయ ఆవరణలో అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆంజనేయ స్వామికి, అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాములకు అన్నదానం చేశారు. అనంతరం షాబాద్ మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన కే శ్రీనివాస్ లావణ్య దంపతులు అన్నదానానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా పట్టణానికి చెందిన త్రిశూల్, గౌతమి దంపతులు దేవాలయ అభివృద్ధికి వెయ్యి రూపాయలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాష్ గౌడ్, పులిమామిడి శ్రీశైలం గౌడ్,మంచనపల్లి శేఖర్ గౌడ్,సోలిపూర్ మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య,ఎంసాని నరసింహులు, గూదే వసంతరావు, గూనెల్లి రమేష్, అశోక్ గౌడ్, బాల్ రెడ్డి, సికేరా రమేష్, జి. సతీష్, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, మంచిరేవుల అశోక్, రఘునందన్ రెడ్డి, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకరయ్య యాదవ్, వీఆర్వో బచ్చన్న, యాదగిరి, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్,భజన భక్త బృందం, మహిళలు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు నర్సింగ్ ప్రభుత్వ పాఠశాలలో



**డిసెంబర్ 21 (సి కె న్యూస్)** చేగుంట గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నార్సింగి లో గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు తయారు చేసినటువంటి వివిధ గణిత శాస్త్ర నమూనాలను ప్రదర్శించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాధికారి శ్రీ మురళీమోహన్ సార్ ప్రారంభించారు . వేడుకలలో భాగంగా పిల్లలకు క్విజ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయులు రామకృష్ణ స్వామి వెంకటేశ్వర శర్మ మరియు ఉపాధ్యాయ బృందం పూర్ణచందర్ పుష్పలత వెంకటేశం ప్రసాద్ భాస్కర్ కిషన్ లలిత మాధవి పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## సమగ్ర శిక్షా ఉద్యోగుల క్రమబద్ధీకరణ అమలు కై నిరవధిక సమ్మె నిరసన ర్యాలీ

**సికె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలంటూ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రం నుండి జడ్పీ సెంటర్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు . అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగసంఘం జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ టీ తాగే లోపు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు . ఒక్క సంతకంతో వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని టీ కప్పులు చేతుల పట్టుకొని నినాదాలు చేశారు . సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె చేపట్టిన నుండి ఈరోజు వరకు ఇద్దరు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి నిమ్మకు నీలెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు . తక్షణమే సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు . ఈ నిరసన ర్యాలీ లో లో పాల్గొన్న టి పి టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్ , కిషన్ నాయక్ పూర్తి మద్దతు తెలిపారు . ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాస్వామి , అడిషనల్ జనరల్ సెక్రటరీ అనిల్ , ఉపాధ్యక్షులు సాంబశివరావు , ఇస్మాయిల్ , వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ నిర్మల , జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయ లక్ష్మి , కోశాధికారి రాణి , కార్యదర్శులు కృష్ణ ప్రసాద్ , సురేష్ , భగవాన్ తదితరులు పాల్గొన్నారు .

# యాసంగిలో వరిని నేరుగా విత్తడం అవలంబిద్దాం - సాగు ఖర్చును తగ్గించుకుందాం...

- సాయి శాంతన్ కుమార్
- వ్యవసాయ అధికారి అశ్వాపురం



**సి కె న్యూస్, పినపాక నియోజకవర్గం, డిసెంబర్ 20,**అశ్వాపురం మండలంలో వరి అనేది ముఖ్యమైన ఆహారపంట. ప్రస్తుత పరిస్థితులలో వరి విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో, నార్లు పోసి, నాట్లు వేయడం అనేది రోజురోజుకి కూలీల కొరతతో, పెరిగిన కూలీల ఖర్చు వలన రైతుకు సాగు ఖర్చులు పెరుగుతుండటం అనేది జరుగుతుంది. అదేవిధంగా నాట్లు ఆలస్యమయ్యి కొన్ని సందర్భాలలో చీడపీడలు లేదా వాతావరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా సరైన దిగుబడులు రాక, సాగు ఖర్చు పెరిగి నికర ఆదాయం తగ్గడం జరుగుతుంది. ఈ పరిస్థితులలో వరిని సాంప్రదాయ నాటు పద్దతిలో కాకుండా ప్రత్యమ్నాయ పద్ధతులైన "నేరుగా వరి విత్తే"పద్దతి వైపు ఎక్కువ మంది రైతులు మొగ్గ చూపిస్తున్నట్లు గమనించడం జరుగుతుంది. ఈ సంధర్భంలో, ప్రస్తుత యాసంగిలో దమ్ములో నేరుగా వరి విత్తే పద్దతుల ద్వారా వరిని విత్తుకున్నట్లయితే కూలీల కొరతను అధికమించడంతో పాటు పంటకాలాన్ని 7-10 రోజులు తగ్గి, సాగు ఖర్చును తగ్గించుకొని నికర ఆదాయాన్ని పెంచుకునే వీలుంటుంది.

**నేరుగా వరి విత్తే పద్ధతులు :**
దమ్ము చేసిన పొలంలో నేరుగా వరి విత్తే పద్ధతుల్లో వరిసాగు విధానం
1) వెదజల్లే పద్ధతిలో వరి సాగు.
2) డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు.

నేలలు : సమస్యాత్మక నేలలు (చౌడు / క్షారము / ఆమ్లము) తప్ప సాధారణంగా వరిని సాగు చేసే అన్ని నేలలు అనుకూలం. ముంపుకు గురయ్యే భూములు సాగుకు అనుకూలం కాదు.

రకాలు :ఆయా ప్రాంతానికి అనువైన రైతుకు ఇష్టమైన ఏరకమైన ఈ పద్ధతిలో సాగు చేసుకోవచ్చు.

**విత్తన మోతాదు :** రకాన్ని బట్టి ఎకరాకు 8-12 కిలోలు అవసరమవుతాయి.

విత్తనశుద్ధి,విత్తనాన్ని మండె కట్టడం : విత్తనాలను లీటర్ నీటికి 1 గ్రాము కార్బెన్డజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టాలి. కిలో విత్తనాలకు లీటర్ ద్రావణము సరిపోతుంది. విత్తనాలను 24 గంటలు నానబెట్టి నానిన విత్తనాలను గోనె సంచిలో వేసి కాని లేదా గోనెసంచి కప్పిగాని 24 గంటలపాటు వుంచాలి. 24 గంటల తర్వాత విత్తనాలు ముక్కు పగిలి తెల్లగా మోను వస్తుంది. రబీ పంట కాలంలో ఉష్ణోగ్రత తక్కువగా ఉంటే విత్తనాలను నానబెట్టిన తర్వాత చలిని బట్టి 24-36 గంటలు మండె కట్టాలి. డ్రమ్ సీడర్ పద్ధతిలో గింజలను ముక్కు పగిలి తెల్లపూస వస్తే సరిపోతుంది. మొలక పొడుగ్గా వస్తే డ్రమ్ సీడర్ నుంచి విత్తనాలు రాలవు కావున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

**విత్తే పద్ధతి :** వెదజల్లే పద్ధతిలో దమ్ముచేసి చదును చేసిన పొలంలో మండె కట్టిన విత్తనాన్ని పొలమంతా సమంగా పలుచటి నీటి పొర ఉంచి వెద జల్లాలి. పొలంలో ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. కాలిబాటలు తీసిన తర్వాత విత్తనాలను చల్లుకున్నట్లయితే మొక్కల సాంద్రత సమంగా ఉండేందుకు వీలుంటుంది. డ్రమ్ సీడర్ పరికరానికి 4 ప్లాస్టిక్ డ్రమ్ములుంటాయి. ప్రతి డ్రమ్ము 20 సెం.మీ. దూరంలో రెండు చివర్ల వరుసకు 18 రంధ్రాలు ఉంటాయి. ఈ డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూత బిగించాలి. గింజలు రాలడానికి వీలుగా ప్రతి డ్రమ్ములో కేవలం 3/ 4 వంతు మాత్రమే గింజలను నింపాలి. గింజలు నింపిన డ్రమ్ సీడర్ లాగితే 8 వరుసల్లో వరుసకు, వరసకు మధ్య 20 సెం. మీ. దూరంలో గింజలు రాలతాయి. వరుసల్లో కుదురుకు, కుదురుకు మధ్య దూరం 5-8 సెం.మీ. వుంటుంది. ఒక్కో కుదురులో 5-8 గింజలు రాలడం జరుగుతుంది. కొన్ని అనివార్య కారణాల వల్ల (మొలక సరిగ్గా లేకనో లేక పక్షులు తినివేయడం వల్లో) కుదురులోని గింజలు 50 శాతం దెబ్బతిన్నా మిగిలిన 50 శాతం గింజల నుండి వచ్చిన మొక్కల సాంధ్రత సరిపోతుంది. రకాన్ని బట్టి గింజలు రాలడాన్ని బట్టి రంధ్రాలను స్టాపర్తో మూసుకోవాలి. సన్న గింజ రకాలకు రంధ్రం వదిలి రంధ్రం మూసేయాలి. ప్రతి 16 వరసులకు అడుగు వెడల్పు కాలిబాటలు ఉంచుకోవాలలీ :

విత్తడానికి అవసరమయ్యే కూలీలు :ఈ పద్ధతిలో ఒక ఎకరా విత్తడానికి కేవలం ఇద్దరు కూలీలు సరిపోతారు.

విత్తడానికి పట్టే సమయం: ఒక ఎకరా విత్తడానికి సాధారణంగా 2 గంటలు సరిపోతుంది. ఒక రోజులో ఒక డ్రమ్ సీడర్ తో 3 ఎకరాల వరకు విత్తుకోవచ్చు.

**ఎరువుల యాజమాన్యం :** ఈ పద్ధతికి కూడా సాధారణ పద్ధతిలో సిఫారసు చేసిన ఎరువుల మోతాదు సరిపోతుంది. కాకపోతే దమ్ములో నత్రజని ఎరువులు వేయకుండా కేవలం భాస్వరం ఎరువు (పూర్తి మోతాదు) మరియు పొటాష్ ఎరువు (సిఫారసు చేసిన మోతాదులో సగం) మాత్రమే వేయాలి. దమ్ములో కాని, విత్తేటప్పుడు కాని నత్రజనిని వేస్తే కలుపు ఎక్కువగా వస్తుంది. కాబట్టి ఆ సమయంలో నత్రజని ఇచ్చే ఎరువులను వేయకూడదు. నత్రజని ఎరువులను 3 భాగాలుగా చేసి 1/3 భాగం విత్తిన 15-20 రోజులకు, 1/3 భాగం విత్తిన 40-45 రోజులకు మిగిలిన 1/3 భాగం నత్రజనిని సగం పొటాష్ను విత్తిన 60-65 రోజులకు వేయాలి.

**కలుపు యాజమాన్యం** :నేరుగా గింజలను విత్తడం వలన కలుపు మొక్కలు కూడ వరి గింజలతో పాటే మొలకెత్తుతాయి. అందువల్ల ఈ పద్ధతిలో కలుపు మందును ఖచ్చితంగా వాడాలి. డ్రమ్ సీడర్ లాగిన లేదా వరి వెదజల్లిన 3 లేదా 4 రోజులలోపు 80 గ్రాముల పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ కలుపు మందును ఒక ఎకరం పొలంలో పిచికారీ చేయాలి. విత్తనాలు వేసిన 20-25 రోజులకు ఏ కారణం చేతనైన వెడల్పాటి ఆకులు మరియు సన్న ఆకు కలుపు ఉంటే ఎకరాకు 100-120 మి.లీ. బిస్ పైరిబాకు సోడియం కలుపు మందును పిచికారీ చేయాలి.

డ్రమ్ సీడర్తో విత్తినప్పుడు, విత్తిన 20-25 రోజులకు కోనో వీడర్ ను నడపాలి. కోనో వీడర్ నడపడం వలన వరుసల్లో మొలచిన కలుపు భూమిలోకి కలియబడుతుంది. తర్వాత 10 రోజులకొకసారి 2 సార్లు కలుపు ఉన్నా లేకపోయినా కోనోవీడర్ను వరుసల్లో నడపడం వలన భూమి బాగా కదిలి, వేరు వ్యవస్థకు గాలి, పోషకాలు బాగా అందుతాయి. ఎక్కువ పీచు వేర్లు వృద్ధి చెంది వేరు వ్యవస్థ బలంగా తయారవుతుంది. దీని వలన అధిక సంఖ్యలో పిలకలు పెట్టడం వలన, కంకులు అధికంగా వచ్చి దిగుబడి పెరుగుతుంది. కోనోవీడర్ను నడపాలనుకున్న ముందురోజు సాయంత్రం పొలంలో పలుచగా నీరుపెట్టి కోనోవీడర్ను నడపాలి, ఇలా నడపడం వలన పలుచటి నీటి పొర మీద పళ్ళ చక్రాలకు మట్టి అంటుకోకుండా బాగా దొర్లుతాయి. పైరు పైరిగే దశలో అక్కడక్కడ ముఖ్యంగా సాళ్ళ మధ్యలో వుండే కలుపు మొక్కలను కూలీల చేత తీయించాలి

**నీటి యాజమాన్యం :** విత్తనం వేసినప్పటి నుంచి పొట్ట దశ వరకు పొలంలో నీరు నిల్వ వుండకుండా కేవలం బురదగా వుంటే సరిపోతుంది. ఎక్కువైన నీరు బయటకు పోవడానికి కాలువలు ఏర్పాటు చేయాలి.

**పంటకోత** :సాంప్రదాయంగా కూలీలతో నాటు వేసే పద్ధతిలో పోలిస్తే దమ్ములో నేరుగా విత్తే పద్ధతిలో సాగుచేస్తే పంట వారం నుండి పదిరోజుల ముందే కోతకు వస్తుంది.

దమ్ములో నేరుగా విత్తే పద్ధతిలో నారుమడి పెంపకం, నారుపీకడం, నాట్లు వేసే పనులపై ఖర్చు ఉండదు. కాబట్టి అధిక నికర ఆదాయం వస్తుంది.

## ఐ డి ఓ సి కార్యాలయంలో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 21,**
ఐడిఓసి కార్యాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సెమీ క్రిస్టమస్ కేక్ ను కలెక్టర్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెమీ క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. క్రిస్టమస్ పండుగ శాంతి, సంతోషానికి, త్యాగానికి, ప్రేమ, కరుణకు తార్కాణంగా జరుపుకుంటామన్నారు. క్రీస్తు జీవనగమనం అందరికీ ఆచరణీయమని అన్నారు. క్రిస్మస్ పండుగ రోజును సంతోషంగా, ఆహ్లాదకర వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాక్షించారు. క్రీస్తు బోధనలు మంచి మార్గంలో నడిపిస్తాయన్నారు. అందరూ ఐకమత్యంతో మెలుగుతూ ఎదుటివారిని క్షమించే గుణాన్ని అలవరచు కోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అందరికీ క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, ఏవో రమాదేవి మరియు కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి


- ఓసి-2 లో మూల్ చంద్ సంతాప సభ లో గని మేనేజర్ కే సురేష్ కుమార్



**సి కె న్యూస్, పినపాక నియోజకవర్గం డిసెంబర్ 21,**రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతి ఒక్కరు పాటుపడాలని మణుగూరు ఏరియా పీకే ఓసి సెక్షన్ -2 గని మేనేజర్ కె సురేష్ కుమార్ అన్నారు. ప్రమాదవశాత్తు గురువారం నాడు ఓసి-2 లో జరిగిన డంపర్ పల్టీ ప్రమాదంలో మృతి చెందిన మూల్ చంద్ సంతాప సభ శనివారం ఓసి-2 నూతన కార్యాలయ ప్రాంగణంలో సెకండ్ షిఫ్ట్ రిలే సి లో జరిగినది. షిఫ్ట్ ఇన్ చార్జ్ భూక్యా భా%శీ%గ్యా అధ్యక్షతన జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. డంపర్ పల్టీ కొట్టడం ఆపరేటర్ మూల్ చంద్ తలకు బలమైన గాయమై ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్ట సంఘటనగా ఆయన అభివర్ణించారు. ఇలాంటి ప్రమాదాల సంఘటనల అనుభవాల నేపథ్యంలో ప్రమాదాలు పునరావతం కాకుండా ప్రతి ఒక్కరు రక్షణతో కూడిన ఉత్పత్తికి పాటుపడాలని కోరారు. యంత్రో రక్షతి రక్షితః యంత్రాన్ని మనం రక్షించుకుంటే యంత్రం మనల్ని రక్షిస్తుందని ఆయన అన్నారు. ఎన్ని కోట్లు వెచ్చించినా కూడా ఇంటి యజమానిని కోల్పోతే తిరిగి రారని అందరితో ఎంతో స్నేహభావంగా ఉండే మూల్ చంద్ చనిపోవడం అత్యంత బాధాకరం అన్నారు కుటుంబంలో ఒక సభ్యుని కోల్పోయాం అన్న భావన కలిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. మూల్ చంద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు సింగరేణి సంస్థ అన్ని విధాలుగా ఆయన కుటుంబాన్ని ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం సామూహిక రక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ మేనేజర్ కళ్యాణ్ రామ్,షిఫ్ట్ ఇన్ చార్జ్ డిప్యూటీ మేనేజర్ భూక్య బా%శీ%గ్యా, నాగేంద్ర కుమార్, అధికారులు భూక్య రాందాస్, బుడ్డి బాబ్జి,భరత్ చంద్ర, ఇంజనీర్ శంకర్, సూపర్వైజర్లు దేవేష్, సుకుమార్, దీక్షిత్, మెకానికల్ ఫోర్ మెన్ రామకృష్ణ, గుర్తింపు సంఘం నాయకులు శనిగరపు కుమారస్వామి, ప్రాతినిధ్య సంఘం నాయకులు కె అనిల్ , సింగరేణి సేవా సమితి సభ్యులు యస్ డి నా సర్ పాషా బీవీఎస్ మూర్తి, పెద్ద ఎత్తున ఆపరేటర్లు, కార్మికులు పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ బలమైన వర్గ పోరాటాలు నిర్మించాలి

**-సిపిఎం జిల్లా కమిటీ సభ్యులుగా నిమ్మల వెంకన్న**



**పినపాక, సి కె న్యూస్,** ఇల్లందు పట్టణం లో జరిగిన సీపీఎం పార్టీ జిల్లా 3వ మహాసభ లో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులుగా నిమ్మల వెంకన్నను 3వ సారి ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా పినపాక మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికైన నిమ్మల వెంకన్న మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ బలమైన వర్గ పోరాటాలు నిర్మించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఈ సంవత్సరం కాలం పూర్తి కాకముందే తమది మంచి ప్రభుత్వమని, గొప్పలు చెప్పుకుంటుందని, అయితే ప్రజలపై భారాలు మోపుతూ ఎటువంటి గొప్పలు చేశారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. మంచి ప్రభుత్వం అని ప్రజలు చెప్పుకోవాలని, ప్రజా ప్రతినిధులే సంబరాలు చేసుకోవడం ఏమిటన్నారు . నెలలు గడవకముందే రాష్ట్ర ప్రజానీకం అంతా ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారన్నారు. కేంద్రం నుంచి నిధులను తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంలో భాగంగా జమిలి ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకురావాలని పార్లమెంటులో చర్చ పెట్టిందని,ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు అంబేద్కర్ అంశం తీసుకొచ్చారన్నారు. పార్లమెంటులో జరుగుతున్న పరిణామాలను అందరూ గమనించాలన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని ఆర్ఎస్ఎస్ ముందుకు తీసుకురావాలని చూస్తున్నదన్నారు. భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే ప్రయత్నాలు బిజెపి ప్రభుత్వం చేస్తుందన్నారు. ఏదో రూపంలో జమిలిపై నెగ్గించుకోవడానికి ప్రయత్నం జరుగుతుందన్నారు. మతోన్మాదానికి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పనిచేసే శక్తులను ఏకం చేసి బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## శాంతియుత సహజీవనమే క్రిస్మస్ సందేశం..



**మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమలరావు**

**బాపూజీ నగర్ లో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు**

**సి కె న్యూస్, పినపాక నియోజకవర్గం డిసెంబర్ 21,** మణుగూరు : శాంతియుత సహజీవనమే క్రిస్మస్ సందేశంమ
ని,మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమలరా వుఅన్నారు. శనివారం బాపూ
జీ నగర్ లోని ఆయన స్వగృహం లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘ నంగా నిర్వహించారు. క్రీస్తు జనన సన్నిదేశాన్ని చాటే, పశువుల పాక ఆయన జన్మించినట్లు చాటిన నక్షత్రం తో పాటు రంగురంగుల విద్యుద్దీపాలను ఏర్పాటు చేశా రు.ముందుగా క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించు కొని దేవుని కుమారునిజన్మదినం లోక రక్షకునికి ఆత్మీయ స్వాగతం పలికారు. పశువుల పాకలో బాల ఏసు కీర్తనలు నిర్వహించారు. పరిశుద్ధ గ్రంథము బైబిల్ వాక్యాల గ్రంథ పఠనం చేసారు . ఏసు
ప్రభువును కొలుస్తూ భక్తులు ఆలాపించిన దైవభక్తి గీతాలు, కీర్తనలు అలరించాయి. ఈ సంద
ర్భంగా పాస్టర్లు డేవిడ్ , ఇసాక్, పరంజ్యోతి, గ్రేస్ మిషన్ స్కూల్ ఇన్చార్జి పుల్లారావు, శిరీష, సామెల్ ఏసుక్రీస్తు జన్మదిన విశిష్టతను వివరించారు. అనంరం తిరుమలరావు మాట్లాడు తూ..ఏసుక్రీస్తు విశ్వ మానవాళికి జ్ఞానము, సూక్తు
లతో మంచి మార్గాన్ని ప్రబోధించా డని, ప్రపంచానికి శాంతి, ప్రేమ పూర్వక జీవన మార్గాన్ని ఉపదే శించాడన్నారు. మనుషుల్లో దేవుడిగా జన్మించి మానవత్వపు పరిణామాలను విశ్వవ్యాప్తం చేశాడన్నారు.నిన్ను వలె నీ పొరు
గువారినిప్రేమించాలంటూ ప్రేమ తత్వాన్ని లోకానికి పరిచయం చేసి సర్వమానవాళినీ పాపం నుంచి విముక్తి కల్పించడానికి శిలువపై తననుతానుఆర్పించు
కున్న దైవ కుమారుడు ఏసుక్రీస్తు అని తెలిపారు. లోకరక్షకునిగా ఆందరికీ సత్య మార్గాన్ని ప్రబోధిం చిన ఆయన జన్మదినంగా ఆచ రించే క్రిస్మస్ వేడుకలు జరుపుకో వడం సంతోషంగా ఉందన్నారు. ఏ మతం అయినా విశ్వ శాంతినే కోరుతుందన్నారు. శాంతియుత సహజీవనమే క్రిస్మస్ సందేశం కాగా, సకల జనులూ సంయ
మనంతో కలిసిమెలిసి ఉండాలన్న క్రీస్తు బోధనలు మానవాళికి ఆచ
రణీయమన్నారు. ఈ సందేశ కర్య క్రమంలో దైవ సెవకులు నేహాన్య, ఆనంద్, బోయిల్ల రమణయ్య, చేపల మడుగు అంజయ్య, గం గాధర్ మహారాజు, పి. రాజు, కే. వేణు తో పాటు అనేక మంది క్రీస్తు ప్రభోదకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ నమూనా గృహానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే తెల్లం.

**పాల్గొన్న సంబధిత అధికారులు, నాయకులు, పార్టీ శ్రేణులు.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 21,**
రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రక్రియలో భాగంగా శనివారం దుమ్మగూడెం మండల కేంద్రంలో ఓ నూతన "ఇందిరమ్మ మోడల్ ఇల్లు" నిర్మాణానికి స్థానిక సంబధిత అధికారులు మరియు ప్రజా ప్రతినిధుల సమన్వయం తో భూమి పూజ చేసి నిర్మాణ శంకుస్థాపనకు శ్రీకారం చుట్టిన భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు తెల్లం వెంకటరావు.
ఈ కార్యక్రమంలో భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ ,గౌరవ దర్శకత్వం అధికారులు హౌసింగ్ డి.ఈ , ఏ ఈ, తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్ , సిఐ అశోక్ ఆర్ ఐ , ఇతర రెవెన్యూ సిబ్బంది, మండల కాంగ్రెస్ అధ్యక్షులు లంకా అబ్బులు సత్యాలు, తోట రమేష్, సోడి తిరుపతి రావు కోడి చంటి నరేంద్ర, బొల్లి శేఖర్, శ్రీకాంత్, శేఖర్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహానేత డాక్టర్ అంబేద్కర్ పై ఓం శాఖ మంత్రి అమీషా చేసిన ఆచితూచి చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలి



**డిసెంబర్ 21 (సి.కె న్యూస్ ) చేగుంట:**చేగుంట మండల కేంద్రంలో శనివారం నాడు మీడియా సమావేశంలో చేగుంట మండల్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు స్టాలిన్ నర్సింలు మాట్లాడుతూ, హెూం శాఖ మంత్రి అమీషా రాజ్యసభలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన వాక్యాలను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఖండిస్తూ, భారత రాజ్యాంగంపై పార్లమెంట్లో జరుగుతున్న చర్చ సందర్భంగా అంబేద్కర్ అనే పేరుకు బదులుగా ఏదైనా దేవుని పేరు ఆస్వాదిస్తే పుణ్యంవస్తుంది, చెప్పడం విడురంగా ఉంది,అన్నారు, మహనీయుడు లాంటి అంబేద్కర్ పై ఆచితూచిగా చేసిన మాటలను, బే శరత్ గా క్షమాపణ చెప్పలి, విదేశాలలో ఆయన విగ్రహానికి గౌరవం చాటుకుంటున్నారు భారతదేశంలో ఉన్న అన్ని కులాలకు మహిళలకు దేశంలో 92.5/ఉన్న బహుజనులకు అంబేద్కర్ అసలైన దేవుడని కొనియాడుతున్నారు, అలాంటి మహనీయుని అవమానపరిచినందుకు, దేశంలో 140 కోట్ల మంది ప్రజలను అవమన పరిచినట్లు, అమిషా కుట్రపడుతున్నారు, ఇప్పుడు వారు కేంద్ర మంత్రి పదవిలో ఉన్నారంటే అంబేద్కర్ పెట్టిన భిక్షా, అమిషా గుర్తుంచుకోవాలి,

అమిత్ షాన్ ను, పదవినుండి పార్టీ నుండి సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల్ ఉపాధ్యక్షుడు ఎం శ్రీనివాస్, మండల్ జనరల్ సెక్రెటరీ,కొండి శ్రీనివాస్, నడిమి తండ, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు, శ్రీనివాస్, పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అమిత్ షా చిత్రపటం దగ్ధం

- అమిత్ షా ను వెంటనే బర్తరఫ్ చేయాలి
- మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు
- అంబేద్కర్ పై అవమానకర వ్యాఖ్యలు చేస్తే చెప్పు దెబ్బలు తప్పవు. అంబేద్కర్ నిజంగా దేవుని కంటే ఎక్కువ
- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనా రెడ్డి






**సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి ( శ్రీనివాస్)డిసెంబర్ 21:**పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ పదేపదే అంబేద్కర్ ను ప్రస్తావించడం ఎందుకని ఇంకా వ్యంగ్యంగా అంబేద్కర్ ను అవమానించే విధంగా మాట్లాడిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయాలని అంబేద్కర్ ను అవమానిస్తే చెప్పు దెబ్బలు తప్పవని అమిత్ షా ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం అంబేద్కర్ పై అమిత్ షా వాక్యాలు నిరసిస్తూ చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం బ్లాక్, మండల అధ్యక్షులు ఊదరి, నరసింహ ఊదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఆందోళన కార్యక్రమం నిర్వహించి నిరసన చేపట్టి అమిత్ షా చిత్రపటాన్ని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ బిజెపి మతోన్మాద శక్తులు మొదటి నుండి భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల దేవుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానించడం పనిపాటిగా పెట్టుకున్నారని దేశభక్తుల ముసుగులో ఉన్న దేశద్రోహులు దేశాన్ని పరిపాలిస్తున్నారని దేశాన్ని కులాలు మతాలు ప్రాంతాలు గా విభజించి పాలిస్తున్నారని విచ్ఛిన్నకర శక్తుల చేతిలో దేశం నలిగిపోతుందని ప్రపంచ దేశాల ముందు భారతదేశ పరువు తీస్తున్నారని ఏకంగా కేంద్ర హెూం శాఖ పదవిలో ఉన్న అమీషా నేరుగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాల్సింది పోయి వారిని అవమానించే విధంగా మాట్లాడడం నిజంగా సిగ్గుచేటు ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని వెంటనే నరేంద్ర మోడీ అమిత్ షాను బర్తరఫ్ చేయాలని, అమిత్ షా వెంటనే ముక్కు నేలకు రాసి జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహా గౌడ్, కౌన్సిలర్ బొడిగె బాలకృష్ణ, షాది ఖానా చైర్మన్ కరీం, మోగుదాల రమేష్ గౌడ్, ఊదరి వెంకటేష్ మహాజన్, చింతల సాయిలు, బక్క శ్రీనాథ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాచకొండ భార్గవ్, కట్టెల లింగస్వామి, పెద్దగోని రమేష్ గౌడ్, ఆవుల ఏసుదాసు, చెరుకు లింగస్వామి, వీరమల్ల సత్తయ్య గౌడ్, కొంతం బుచ్చిరెడ్డి, ఐత రాజు లింగస్వామి, మాధగోని శేఖర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కంచరకుంట్ల రామ్ రెడ్డి, ఎండి ఎజాజ్ దాసరి గణేష్, నెల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు

# 48వ డివిజన్లో గ్రేస్ సర్వీస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు !



**సికె న్యూస్ ప్రతినిధి : ఖమ్మం:** స్థానిక 48వ డివిజన్ లోని %వీ.దీ% గార్డెన్స్ లో గ్రేస్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు అయినటువంటి బిషప్యం జాకోబ్ గారు ఈ కార్యక్రమానికి సంబంధించిన సుమారు 500 మందికి ఒక్కొక్కరికి 3000 రూపాయలు చొప్పున నిత్యవసర సరుకులు దుస్తులను ఖమ్మం నగరంలోని పేద పాస్టర్లకు వీటిని ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మేయర్ నీరజ, డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు సమక్షంలో ఇవ్వటం జరిగింది తదనంతరము క్రైస్తవ సోదరి సోదరీమణులతో క్రిస్మస్ సంబరాలు నిర్వహించడం జరిగింది. అంతకుముందును కేకులు కట్ చేసి క్రిస్మస్ సోదరులకు అడ్వాన్సుగా కలెక్టర్ శు భాకాంక్షలు తెలియజేసినారు . ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ కేక్ కట్ చేసి క్రిస్మస్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి నారు.

ఈ కార్యక్రమంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ సభ్యులు, ఎన్ ఎస్ టి పాల్ ఫాస్టర్స్ కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# మహాత్మ జ్యోతిబాపూలే లో శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు





- విద్యార్థులు గణితంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు
- శ్రీనివాస రామానుజన్ ను ఆదర్శంగా తీసుకోవాలి
- ఆకట్టుకున్న విద్యార్థుల గణిత ప్రదర్శనలు
- ప్రిన్సిపాల్ ఎన్ సుధాకర్

**సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్)డిసెంబర్ 21:** గణితంలో రాణించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మహాత్మ జ్యోతిబాపూలే ప్రిన్సిపల్ ఎన్ సుధాకర్ తెలిపారు. ఆదివారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఒకరోజు ముందుగా శనివారం కొత్తగూడెం పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్ సుధాకర్ గణిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వారితో కలిసి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్ సుధాకర్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ ను ఆదర్శంగా తీసుకొని గణితంపై ఆసక్తిని, మెలకువలను తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. గణితం పట్ల విద్యార్థులు తమలో ఉన్న భయాన్ని పోగొట్టుకొని ఆసక్తిని పెంచుకుంటే ఎన్నో అద్భుతాలు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. భారతదేశానికి చెందిన శ్రీనివాస్ రామానుజన్ చిన్న వయసులోనే గొప్ప గొప్ప సిద్ధాంతాలను కనుగొని దేశ విదేశాలలో భారతదేశ ఖ్యాతిని నిలిపిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.గణిత ఎగ్జిబిషన్లో విద్యార్థులు తయారుచేసిన పలు ప్రయోగాలను చూసి విద్యార్థులను ఆయన అభినందించారు.

**ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు....**

పాఠశాల విద్యార్థులు తాము తయారుచేసిన పలు ప్రయోగాలను పాఠశాలలో ఏర్పాటుచేసిన గణిత ప్రదర్శనలో గణిత సంకేతాలను, గణిత చిహ్నాలను,ప్రయోగాలను ప్రదర్శించి చూపరులను ఆకట్టుకున్నారు.గణిత ఉపాధ్యాయులు సుమలత, లావణ్య, శోభారాణి,పి అనూష, మహేందర్ రెడ్డి, రాజేష్, మునిరాతి శేఖర్ ల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, గణిత ఉపన్యాస పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎం సుధాకర్, ఏటిపి అనురాగిణి,గణిత ఉపాధ్యాయుల చేతులమీదుగా బహుమతులను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ సిఆర్టి ల సమస్యలు పరిష్కరించాలి. -టిపిటిఎఫ్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 21,**గిరిజన సంక్షేమ విద్యాసంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల (సిఆర్టి) సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి బుటారి రాజు ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యులు మునిగడప రామాచారి లు ప్రభుత్వాన్ని కోరారు. ఐటీడీఏ కార్యాలయం ముందు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ సిఆర్టి లు చేస్తున్న ధర్నాకు మద్దతు తెలిపి వారిని ఉద్దేశించి బుటారి రాజు మునిగడప రామాచారి లు మాట్లాడుతూ.... అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం గడిచినప్పటికీ నూతన ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగానే కాంట్రాక్టు ఉద్యోగులను పట్టించుకోక పోవడం బాధాకరమని, గత ప్రభుత్వ విధానాలను ప్రస్తుత పాలకులు కూడా కొనసాగిస్తున్నారని, గిరిజన సంక్షేమ సిఆర్టి లకు రెండు సంవత్సరములు గడిచిన పిఆర్సి బకాయిలు చెల్లించకపోవడం, సుమారు గత ఏడు నెలల నుండి నెలవారి జీతములు విడుదల చేయకపోవడం విచారకరమని, అతి తక్కువ నామమాత్రపు వేతనంతో పని చేస్తున్న వీరికి నెలనెలా జీతం చెల్లించకపోవడం ప్రభుత్వ సాచివేత ధోరణికి నిదర్శనమని అన్నారు. సరిపడా విద్యాసంస్థలు పనిభారం ఉన్నప్పటికీ వీరి సర్వీసును రెగ్యులరైజ్ చేయకపోవడం, సమస్యలు పరిష్కరించకపోవడం, వారు పనిచేస్తున్న పోస్టు యొక్క కనీస వేతనమును చెల్లించకపోవడం, రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ వీరికి అన్ని రకాల ఆర్థిక లాభాలు సౌలభ్యాలు కల్పించకపోవడం ప్రభుత్వ శ్రమదోపిడికి నిదర్శనమని, రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఉధృతరూపం దాల్చడానికి ముందే ప్రజా ప్రభుత్వం అని తమకు తామే అభివర్ణించుకుంటున్న పాలకులు సిఆర్టి లతో చర్చలు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## పారా లీగల్ వాలంటర్లు ప్రజలకు వారధిగా పనిచేయాలి.

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ .**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 21,**పారా లీగల్ వాలంటీర్లు ప్రజలకు న్యాయ సేవాధికార సంస్థలకు వారధిగా నడుచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తెలిపారు. పారా లీగల్ వలంటీర్లకు ఒక రోజు పాటు ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరం లో జడ్జి పాల్గొని మాట్లాడారు.ఈ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను, చట్టాలను ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థల విధులను, లక్ష్యాలను ప్రజలకు తెలియజెప్పి, ఏ పౌరుడు న్యాయాన్ని కోల్పోకుండా పారా లీగల్ వాలంటీర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. శిక్షణ ట్రేట్కనర్లుగా నియమించిన న్యాయవాదులు వివిధ చట్టాల గురించి పారాలీగల్ వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో




జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి. రామారావు మరియు శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్లుగా డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. నిరంజన్ రావు, మారపాక రమేష్ కుమార్, పాండురంగ విటల్, సాదిక్ పాషా, నరేంద్రబాబు, జీకే అన్నపూర్ణ, మహాలక్ష్మి, ఎన్ ప్రతిభా, నాగస్రవంతి, మెండు రాజమల్లు పాల్గొన్నారు.

## సింగరేణికి ఎనర్షియా అవార్డు ప్రదానం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),డిసెంబరు 21,** సింగరేణి సంస్థ కు జాతీయస్థాయి లో అత్యుత్తమ పర్యావరణహిత మైనింగ్ మరియు సోలార్ ఉత్పాదక సంస్థగా ప్రతిష్టాత్మక ఎనర్షియా అవార్డును శుక్రవారం రాత్రి విశాఖపట్నంలో బహూకరించారు. ఎనర్షియా 17వ పర్యావరణ మైనింగ్ మరియు సాంప్రదాయేతర ఇంధన వనరుల జాతీయస్థాయిలో ఇండియాస్ బెస్ట్ అండ్ మోస్ట్ సస్టైనబుల్ కోల్ మైనింగ్ అండ్ ఆపరేషన్ విత్ రెన్యువబుల్ ఎనర్జీ అనే అవార్డును కేంద్ర ఎలక్ట్రిసిటీ అథారిటీ చైర్మన్ ఘన్ శ్యామ్ ప్రసాద్ నుండి సింగరేణి సంస్థ సీఎండీ తరఫున డైరెక్టర్ ఇ అండ్ ఎం. డి సత్యనారాయణ రావు, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ ఎస్ డి.ఎం సుభాని స్వీకరించారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో జీఎం (కో ఆర్డినేషన్) ఎస్ డి ఎం సుభాని ఈ అవార్డును సంస్థ చైర్మన్ మరియు ఎండి ఎన్ ఎన్ బలరామ్ కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ ఎన్ .బలరామ్ మాట్లాడుతూ రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటు కు సిద్ధం కావడం, భారీ జలాశయాల్లో ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండటం, కార్బన్ డై యాక్సైడ్ నుంచి మిథనాలు తయారీ, భారీగా మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలకు గుర్తింపు లభించిందన్నారు. జాతీయ స్థాయిలో ఈ అవార్డు రావడం ఎంతో స్ఫూర్తిని కలిగిస్తుందని, ఇక ముందు కూడా సింగరేణి సంస్థ పర్యావరణహిత మైనింగ్ ను మరింతగా పెంపొందిస్తూ సోలార్ విద్యుత్తు కూడా పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు.

## సింగరేణి బొగ్గు రవాణాకు పూర్తి సహకారం.

- డిమాండ్ మేరకు రేకులను అందుబాటులో ఉంచేలా చర్యలు.
- సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ , దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ హామీ.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబరు 21,**రానున్న రోజుల్లో థర్మల్ కేంద్రాల్లో బొగ్గు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో బొగ్గు రవాణా సాఫీగా సాగేందుకు ఇకపై రోజుకు కనీసం 40 రేకుల ను అందుబాటులో ఉంచాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ను కోరారు. దీనిపై దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ సానుకూలంగా స్పందించారు. రైల్ నిలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. సింగరేణితో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న థర్మల్ కేంద్రాలకు తగినంత బొగ్గును సరఫరా చేయడం కోసం రోజుకు 40 రేకుల అవసరం ఉందన్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ స్పందిస్తూ దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి, దక్షిణ మధ్య రైల్వే ఎన్నో ఏళ్లుగా సమన్వయంతో సేవలు అందిస్తున్నాయని, ఇకపైనా డిమాండ్ మేరకు రేకులను పెంచడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సింగరేణి జీఎం (మార్కెటింగ్) రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 2 రోజు సీఆర్టిల సమ్మెకు మద్దతు తెలిపిన పలు సంఘ నాయకులు.

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 21,** ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఆరు నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఆర్టీలు చేస్తున్న సమ్మె 2 రోజుకు చేరుకుంది. ఐటీడీఏ ముందు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న 2 వ రోజు సమ్మెలో ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిఆర్టి ఉపాధ్యాయుల డిమాండ్ లైన రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 2100 మంది ఏదైనా ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల కు మినిమం టైం స్కేల్ వర్తింపచేసి, 61 సంవత్సరాల తో కూడిన ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెల గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలను చెల్లించాలని, అర్హత కలిగిన వారిని రెగ్యుల రైజేషన్ చేయాలని, గత 6 నెలలుగా పెండింగ్ లో ఉన్న జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు రెసిడెన్సియల్ ఉపాధ్యాయ సమ్మెకు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టిపిఆర్టీయూ వ్యవస్థాపకులు టిపిపిఎస్సి అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, జాక్టో ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్, టిపిఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రవి, టిపిటిఎఫ్ మాస పత్రిక సంపాదకులు మునిగడప రామాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి రాజు గిరిజన సంక్షేమ శాఖ గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు రామారావు, బద్రు, నరసింహారావు, రవి యూటీఎఫ్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు మరియు వివిధ కుల సంఘాల నాయకులు ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు

## జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్,

ఐలాపురం కనకయ్య యాదవ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు.




**డిసెంబర్ 21 ( సీ కే న్యూస్) చేగుంట** :అక్బర్ పేట భూంపల్లి మండలంలోని భూంపల్లి గ్రామంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎల్లన్న గారి వంశీధర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శాలువాతో సత్కరించి కేక్ తినిపించిన దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, ఐలాపురం కనకయ్య యాదవ్. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అబ్బుల ఉమా రాణి బాల గౌడ్, మండల ఉపాధ్యక్షులు ముత్తంగి భూమయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అబ్బుల మమ్ము గుడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్లన్న గారి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆరుట్ల శ్రీనివాస్ రెడ్డి, బాల్తే వెంకటేశం, పాతూరి శ్రీనివాస్ గౌడ్, కడవెరుగు రవీందర్, పాపని దామోదర్ గౌడ్, వెలుపుల యాదగిరి ముదిరాజ్, ఎల్లన్న గారి మధుసూదన్ రెడ్డి, భూం పల్లి బీంరావు, ఎదురు బాలరాజు, పుల్లని ఎల్లయ్య, కడవెరుగు నాగరాజు, పోతారం ముత్యాలు, ఎమ్మ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్ల మీద ఉక్కుపాదం మోపుతాం

మహిళల పట్ల నేరాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదు: సీపీ సుధీర్ బాబు ఐపీఎస్




**సికే న్యూస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్ :** రాచకొండ కమిషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ గారు ఈరోజు కమీషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ లో ఈ సంవత్సరంలో మొత్తం 25 చైన్ స్నాచింగ్ కేసులు నమోదు కాగా క్రైమ్ సిబ్బంది, సిసిఎస్ ఎల్బీనగర్, ఐటీ సెల్ సహకారంతో అన్నిటినీ త్వరితగతిన విచారణ జరిపి అన్ని కేసులను పరిష్కరించిన అధికారులు మరియు 18 మంది సిబ్బంది ఈ రోజు రాచకొండ కమిషనరేట్లో ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గారు మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా అహర్నిశలు కృషి చేస్తున్నామని, మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో సీసీటీవీలను విస్తృతంగా వినియోగించడం కూడా కేసుల విచారంలో అధికారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. మహిళల పట్ల నేరాలకు పాల్పడే వారిని మరియు చైన్ స్నాచర్లనను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ హెచ్చరించారు. ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, ఎస్ఓటి డిసిపి మురళీధర్, ఎస్ఓటి అడిషనల్ డీసీపీ నంద్యాలనరసింహారెడ్డి, వనస్థలిపురం ఏసిపి కాశిరెడ్డి, వనస్థలిపురం, మీర్పేట్ డిఐలు తదితరులు పాల్గొన్నారు

# భారత దేశ నిర్మాణంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకం.

- వందేళ్ల సిపిఐ పండుగకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి.
- ప్రతి నియోజకవర్గంలో భారీ భహిరంగ సభకు ప్రణాళిక.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 21,** స్వతంత్ర పోరాటం నుంచి పురుడు పోసుకున్న కమ్యూనిస్టు పార్టీ స్వతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని, స్వతంత్ర అనంతరం భారత దేశ నిర్మాణంలోనూ కీలక భూమిక పోషించిందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని దారా ఫంక్షన్ హాల్ నందు శనివారం జరిగిన కొత్తగూడెం టౌన్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల స్థాయి కార్యవర్గ సభ్యుల సమావేశానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిపిఐది వందేళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర అని, భారీ నీటి ప్రాజెక్టుల నిర్మాణం, బ్యాంకుల విలీనం, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటులో సిపిఐ కీలక పాత్ర పోషించిందని, అదే క్రమంలో పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాడుతోందని అన్నారు. శత వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో గ్రామ గ్రామాన ఉత్సావాలి జరిపేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 26న జిల్లా వ్యాపితంగా జెండావిష్కరణల తో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో బస్తీల్లో పెద్దఎత్తుల ఉత్సవాలు జరపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో భారీ భహిరంగ సభలు నిర్వహించ బోతున్నామని, జిల్లా స్థాయి బహిరంగ సభ జనవరిలో ఐదు లక్షల మందితి నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఈనెల 30న నల్గొండలో భారీ భహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగింపు సభ 2025 డిసెంబర్ 25న ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చంద్రగిరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాసి వెంకటేశ్వర్ రావు, సలిగంటి శ్రీనివాస్, మండల కార్యదర్శులు వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, జి వీరాస్వామి, కందుల భాస్కర్, రత్నకుమారి, ఫహీమ్, పొలమూరి శ్రీను, మాతంగి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## హెూంగార్డులకు జీతాలు పెంచిన ఘనత బీఆర్ఎస్ దే



- హెూంగార్డులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి
- హెూంగార్డులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వానికి సూచన
- పదివేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ పద్ధతే వర్తింపచేయాలి
- శాసనమండలిలో ఎన్నో సమస్యలు వినిపిస్తున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**సి కే న్యూస్ షాద్ నగర్ :డిసెంబర్ 21:** అహర్నిశలు పనిచేస్తున్న హెూంగార్డులకు తప్పనిసరిగా హెల్త్ కార్డులు ఇవ్వాలంటూ, అలాగే హెూంగార్డులను పర్మినెంట్ చేయాలని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో హెూంగార్డ్ ల నెల జీతం చాలా పెంచారంటూ, రిటైర్మెంట్ తర్వాత హెూంగార్డులకు ఎలాంటి బెనిఫిట్స్ ఉండవు కనుక ప్రస్తుత ప్రభుత్వం హెూంగార్డులను దృష్టిలో పెట్టుకొని వారిని పర్మినెంట్ చేయాలని, అలాగే వారికి జీతాలు కూడా పెంచాలని, ఒకవేళ ఒకటి రెండు రోజులు వారు ఉద్యోగానికి రాకుంటే వారి జీతం కట్ చేయకుండా ఉండాలని, హెూంగార్డులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చూసే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ప్రభుత్వానికి విన్నవించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో నెల 2024 నుండి నూతన ప్రభుత్వ పెన్షన్ స్కీమ్ అమల్లోకి వచ్చిందంటూ, అంతకు ముందే రెండు మూడు 2023 లో నోటిఫికేషన్ వచ్చి, ఫలితాలు కూడా వచ్చి, కొన్ని అనివార్య కారణాలు కారణాల వలన ప్రభుత్వం వారికి ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని, కానీ కేంద్ర ప్రభుత్వం 2023 లోని చట్టం తెచ్చిందని ఉద్యోగాలు రాలేకపోయిన వారిని కూడా అదే స్కీమ్ లోకి తీసుకోవాలని, ఈ చట్టాన్ని అనేక రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని, 6500 మంది టీచర్లు, 2200 మంది పోలీస్ డిపార్ట్మెంట్ వాళ్లు దాదాపుగా 10000 మంది ఉన్నారంటూ వారందరికీ పాత పెన్షన్ పద్ధతిలోనే తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

## ధర్మసాగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల,లో తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ .

**సి కె న్యూస్ డిసెంబర్ 21 హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్**

జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ధర్మసాగర్లో ఎత్నిక్ డే మరియు తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ను అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు.

ఈ కార్యక్రమం సాంస్కృతిక అవగాహనను పెంపొందించడం, సాంప్రదాయ వారసత్వాన్ని సంరక్షించడం , తెలంగాణ గొప్ప వైవిధ్యాన్ని ప్రదర్శించడం లక్ష్యంగా పెట్టుకుంది.

విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పారు.

తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్లో కోడికూర, రవ్వ లడ్డు, సర్వపిండి, ముద్ద గారెలు , బెల్లం అన్నం వంటి అనేక రకాల సంప్రదాయ వంటకాలు ఉన్నాయి.



ఈ సందర్భంగా ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు ధర్మప్రకాష్ మాట్లాడుతూ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతోపాటు జాతి వైవిధ్యాన్ని పెంపొందించుకోవాల్సిన ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. ఇలాంటి సంఘటనలు మన విద్యార్థులు తెలంగాణ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని అర్థం చేసుకోవడానికి అభినందించడానికి సహాయపడతాయని ఆయన అన్నారు.

ఉపాధ్యాయులు కవిత, పద్మజ, రాజమ్మ, కిరణ్మయి, రామకృష్ణ తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే సాంస్కృతిక కార్యక్రమాలకు విద్యార్థులకు మార్గనిర్దేశం చేయగా ఉపాధ్యాయులు అభినందించారు.

## జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ధర్మసాగర్లో గణిత దినోత్సవం

**సి కె న్యూస్ డిసెంబర్ 21 హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్**

గణిత శాస్త్ర అవగాహనను పెంపొందించడం, సమస్య-పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకునేలా విద్యార్థులను ప్రోత్సహించడం , రోజువారీ జీవితంలో గణితశాస్త్రం ప్రాముఖ్యతను ప్రదర్శించడం ఈ కార్యక్రమం లక్ష్యం.

వేడుకల్లో విద్యార్థులు పజిల్స్, క్విజ్లు, గణిత నమూనాల తయారీ , సమస్యల పరిష్కార పోటీలతో సహా వివిధ గణిత సంబంధిత కార్యకలాపాలలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో గణిత నమూనాలు , ప్రాజెక్టులను ప్రదర్శించే ప్రదర్శనలు కూడా ఉన్నాయి.

ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు ధర్మ ప్రకాష్ ఆధునిక జీవితంలో గణితానికి గల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.



“సమస్యల పరిష్కారానికి విమర్శనాత్మక ఆలోచనకు గణితం ఒక ముఖ్యమైన సాధనం. గణిత దినోత్సవాన్ని జరుపుకోవడం విద్యార్థులకు గణితం , దాని అనువర్తనాల పట్ల లోతైన ప్రశంసలను పెంపొందించడానికి సహాయపడుతుంది” అని ఆయన చెప్పారు.

కార్యక్రమ కోఆర్డినేటర్ కిరణ్మయి, గణిత ఉపాధ్యాయురాలు, నిత్య జీవితంలో గణితానికి గల ప్రాధాన్యతపై కీలకోపన్యాసం చేశారు.

గణిత దినోత్సవాన్ని జరుపుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె హైలైట్ చేసింది, వాటితో సహా:

గణిత శాస్త్ర అవగాహన ప్రశంసలను ప్రోత్సహించడం- సమస్య పరిష్కార నైపుణ్యాలు విమర్శనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం

దైనందిన జీవితంలో గణితానికి ఉన్న ప్రాముఖ్యతను తెలియజేస్తుంది- విశ్లేషణాత్మక తార్కిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం

విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి, ఆసక్తిని పెంపొందించడం

జిల్లా విద్యాశాఖాధికారిణి వాసంతి ఎగ్జిబిషన్ను సందర్శించి, ఎగ్జిబిట్లను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల కార్యకలాపాలు, కృషిని ఆమె అభినందించారు.

## అంబేద్కర్ గారిని అవమానించిన అమిత్ షా పై చర్యలు తీసుకోవాలి

- అమిత్ షాను మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయాలి
- దళితులపై అమిత్ షా కక్ష పూర్తి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి



**సి కె న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్:** నేషనల్ బంజారా మిషన్ ఇండియా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు రవి రాజ్ రాథోడ్. మాట్లాడుతూ. దళితుల పై, బీజేపీ, కేంద్రప్రభుత్వానికి ఉన్న కక్షను కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తన మాటల్లో వ్యక్తపరిచారని ఎన్ బి ఎం ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు రవి రాజ్ రాథోడ్ అన్నారు. రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చలో భాగంగా అంబేద్కర్ పై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ కామెంట్స్ పై అంబేద్కర్, దళిత సమాజానికి అమిత్ షా క్షమాపణ చెప్పి, తన వ్యా ఖ్యలకు బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్య లను ఖండిస్తూ శనివారం కీసరలోని స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరు సమావేశంలో ఎన్ బి ఎం ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మురళి నాయక్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు

## అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి.

- బోయ రామచంద్రం



**సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్) డిసెంబర్ 21:** డా,, బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని అవమనిస్తూ పార్లమెంట్ లో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా మాట్లాడటాన్ని నిరసిస్తూ నేడు అంబేద్కర్ గారి విగ్రహం దగ్గర దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దళిత సంఘాల సీనియర్ నాయకులు బోయ రామచంద్రం మాట్లాడుతూ అంబేద్కర్ గారు రాసిన రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన సాక్షాత్తు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, డా,, బి.ఆర్. అంబేద్కర్ గారినే అవమానించడం ఒక సిగ్గుమాలిన చర్య అని, అవమానకరంగా మాట్లాడిన అమిత్ షా ను కేంద్రమంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తూ మనువాద ప్రేమికుడినని నిరూపించుకున్న అమిత్ షా ఈ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పలి. బీజేపీ ప్రభుత్వం గత కొన్ని సం,, రాలుగా భారత రాజ్యాంగాన్ని మార్చేయడానికి కుట్రలు చేస్తుందని, ఆ కుట్రలో భాగంగానే నిన్న అమిత్ షా పార్లమెంట్ లో అంబేద్కర్ గారిని అవమానిస్తూ మాట్లాడడం జరిగిందని ఆయన అన్నారు. దేశ ప్రజలు ఈ మనువాద పాలకుల కుట్రలను ఐక్య పోరాటాల ద్వారా ఎదుర్కోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఊదరి వెంకట్ మహాజన్, బోయ లింగస్వామి, ఊదరి నర్సింహా, కట్టెల లింగస్వామి, ఆరుట్ల లింగస్వామి, కాకి సుందర్, ఊదరి శ్యామ్ సుందర్, ఎర్ర శంకర్, ఊదరి శ్రీనివాస్, పుర్రు యాదయ్య, పాపగళ్ల లింగస్వామి, పుర్రు శంకరయ్య, గ్యార సుధాకర్, మీసాల మల్లయ్య, సరిపల్లి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు.....

- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- 600 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మిస్తున్నాం
- డిసెంబర్ చివరి వరకు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాల సేకరణ పూర్తి
- రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇండ్లు నిర్మించడమే లక్ష్యం
- భూ భారతి చట్టం ద్వారా పేదల భూ హక్కులు పటిష్టం
- కల్లూరు మండలంలో డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి
- నెల రోజులలో కల్లూరు మున్సిపాలిటీ మంజూరు చేస్తాం
- ఇందిరమ్మ ఇళ్లు మోడల్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం/ కల్లూరు, డిసెంబర్ 21:** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

శనివారం మంత్రి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ లతో కలిసి కల్లూరు ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో రూ. 5 లక్షల అంచనా విలువతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు మోడల్ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి పేదవాడికి తినేందుకు సరిపడా భోజనం, కట్టు కునేందుకు బట్టలు, ఉండటానికి ఒక చిన్న ఇల్లు ఉండాలని కోరిక ఉంటుందని అన్నారు. పేదలకు సొంత ఇల్లు కల్పించాలని గతంలో వైయస్సార్ హయంలో రికార్డు స్థాయిలో ఇండ్ల నిర్మాణం జరిగిందని, నేడు మరోసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా ఇండ్లు నిర్మిస్తున్నామని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద మొదటి విడతగా ప్రభుత్వం నాలుగున్నర లక్షల ఇండ్లను మంజూరు చేస్తుందని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం నమూనాల కోసం ప్రతి మండల కేంద్రంలో మోడల్ హౌస్ ఒకటి నిర్మిస్తామని, సుమారు 600 ఇందిరమ్మ ఇండ్లు మోడల్ హౌస్ లు నిర్మించడం జరుగుతుందని, నేడు కల్లూరు మండల ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో నమూనా ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని అన్నారు.

మోడల్ హౌస్ ను పరిశీలించి తక్కువ ధరతో నాణ్యతతో ఇల్లు ఎలా కట్టాలో పేదలు పరిశీలించి, వారి స్థలాలలో నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఇంటిలో నివసించే ప్రజలే నిర్మాణం చేసుకునేలా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఇంటి నిర్మాణానికి ఎటువంటి నిబంధనలు లేవని, 400 చదరపు అడుగులు తగ్గకుండా స్థలంలో ఒక బాత్ రూమ్, ఒక కిచెన్ ఉండేలా నిర్మాణం చేసుకోవాలని మంత్రి తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల క్రింద సొంత స్థలం ఉన్న వారికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం 4 విడతలలో అందుతుందని, ఫౌండేషన్ వేసిన తర్వాత లక్ష రూపాయలు, కిటికి దశ తర్వాత లక్ష పాతిక వేలు, స్లాబ్ దశ చేరిన తర్వాత లక్ష 75 వేల రూపాయలు, ఇళ్లు పూర్తి చేసిన తర్వాత మరో లక్ష రూపాయలు మొత్తం ఐదు లక్షల సహాయం పేదలకు ఇంటి కోసం అందుతుందని అన్నారు.

వివిధ కారణాలు చూపి ప్రజలకు ఇండ్లు ఎగ్గొట్టే ఉద్దేశం ప్రజా ప్రభుత్వానికి లేదని, రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇండ్లు నిర్మించాలని ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. పేదలకు రాజకీయ పార్టీలు, కుల, మతాల కతీతంగా అర్హులకు ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు.

ప్రజా పాలనలో ప్రతి గ్రామం నుంచి సేకరించిన దరఖాస్తులలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని, వీటిలో అర్హులైన దరఖాస్తులను ఎంపిక చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా సర్వే చేపట్టామని, ఇప్పటి వరకు 21 లక్షల 17 వేల 734 మంది సర్వే పూర్తయిందని అన్నారు. డిసెంబర్ నెలాఖరులోపు సర్వే పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు.

రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి గ్రీన్ ఛానల్ లో నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ కు ఎక్కువ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇండ్ల నిర్మాణాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని అన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గానికి గతంలో మంజూరై లబ్ధిదారులకు అందించని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని, వీటి నిర్మాణం పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని అన్నారు. పేద ప్రజలకు అభద్రతా భావం తొలగించి, వారిలో విశ్వాసం కల్పించేందుకు తెలంగాణ భూ భారతి చట్టం 2024 ప్రవేశపెట్టామని అన్నారు.

గతంలో పెండింగ్ ఉన్న 9 లక్షల సాదా బైనామా దరఖాస్తులకు ఇందిరమ్మ ప్రభుత్వం పరిష్కరిస్తుందని అన్నారు. ప్రజల కోసం తయారు చేస్తున్న భూ భారతి చట్టం సభలో ఆమోదం జరిగే సమయంలో ప్రతిపక్ష పార్టీ నాయకుడు అసెంబ్లీకి హాజరు కాకపోవడం విచారకరమని అన్నారు.

కల్లూరు మండలంలో డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల మంజూరుకు కృషి చేస్తానని, అదే విధంగా రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజల డిమాండ్ మేరకు నెల రోజులలో కల్లూరు మున్సిపాలిటీ మంజూరు చేస్తామని అన్నారు.

కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసి ఆరు నెలల గడవక ముందే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం గర్వ కారణమని అన్నారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు అదనంగా ఇండ్లు కేటాయించాలని ఎంపీ మంత్రిని కోరారు.

కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలలో అతి ముఖ్యమైనది పేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందించడానికి నమూనా ఇండ్లు నిర్మించడం సంతోషకరమని అన్నారు. ప్రజా పాలన రావాలని ప్రజలు ఆశించి ప్రభుత్వం ఏర్పాటుకు సహకారం అందించారని, వారి రుణం తీర్చుకునే దిశగా పనిచేస్తామని అన్నారు.

సత్తుపల్లిలో గిరిజన, గ్రామీణ ప్రజలు అధికంగా ఉంటారని, ఇక్కడ అధికంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, మంత్రి ప్రత్యేక దృష్టి సాధించి అదనపు ఇండ్లు అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కల్లూరు మండలంలో ఉన్న సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే కోరారు.

కల్లూరు మండలంలో విద్యార్థులు చాలా బాగా చదువుతున్నారని, ఇక్కడ ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ వసతి లేదని, ఇంటర్ పిల్లలకు హాస్టల్ వసతి కల్పించాలని, కల్లూరు మున్సిపాలిటీగా తయారు చేయాలని, డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, కల్లూరు ఆర్డీవో రాజేందర్, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, హౌజింగ్ ఇఇ భూక్యా శ్రీనివాస్, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, కల్లూరు, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు నీరజ ప్రభాకర్, డి. ఆనంద్, సిడిసి ఛైర్మన్ కె. నరేందర్, సత్తుపల్లి మునిసిపల్ చైర్మన్ జయపాల్, మునిసిపల్ కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని ఆకస్మికంగా తనిఖీ చేసిన.. డి ఎం హెచ్ ఓ గోపాల్ రావు



**సికే న్యూస్ వాజేడు మండల ప్రతినిధి షేక్ రహీమ్ :** వాజేడు మండల పరిధిలోని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గోపాల్ రావు ఆకస్మికంగా రోగుల గదులను,మందుల ల్యాబ్ ను,పరిశీలించి,హాస్పిటల్ కు రోజుకు ఎంత మంది రోగులకు ట్రీట్మెంట్ జరుగుతుంది అని రోగుల రిజిస్టర్ తనిఖీ చేసిన అనంతరం హాస్పిటల్ ఉద్యోగుల స్టాఫ్ హాజరు రిజిస్టర్ పరిశీలించి వారి పనితీరు వివరాలు సేకరించారు, ఈ తనిఖీలో హాస్పిటల్ డాక్టర్ తరుణ్ , ఫార్మసిస్ట్ సతీష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీను లు ఉన్నారు

## బుచ్చిగూడ అండర్ పాస్ బ్రిడ్జి కింద మహిళ హత్యకేసులో నిందితుడు అరెస్టు



షాద్ నగర్ సీఐ విజయ్ కుమార్ వెల్లడి

**సి కే న్యూస్ షాద్ నగర్ :డిసెంబర్ 21:** చెత్త ఏరుకునే మహిళను అత్యంత పాశవికంగా కొట్టి హత్య చేసిన కేసులో నిందితుడిని షాద్ నగర్ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూర్ మండలం జోలాపూర్ గ్రామానికి చెందిన నిందితుడు వడ్డె వెంకటేష్ (40)ను రిమాండ్ కు తరలించినట్లు స్థానిక సీఐ విజయ్ కుమార్ మీడియాకు వెల్లడించారు. కేసు వివరాలను వెల్లడిస్తూ డిసెంబర్ 15న రాత్రి బుచ్చిగూడ అండర్ పాస్ బ్రిడ్జి కింద చెత్త ఏరుకుని ఉంటున్న పావని (35)ని స్థానికంగా బిక్షాటన, లేబర్ పని చేసుకునే వడ్డె వెంకటేష్ ప్రశ్నిస్తూ.. ఎక్కడికి వెళ్లావని అడగగా మక్తల్ లో నివాసం ఉండే తన భర్త వాకిటి శ్రీనివాస్ వద్దకు వెళ్లి వచ్చినట్లు చెప్పగా, తీవ్ర ఆగ్రహానికి గురైన వడ్డె వెంకటేష్ పావనిని కట్టెతో తలపై, శరీరంపై విచక్షణా రహితంగా కొట్టాడని తెలిపారు. తెల్లారి లేచిచూసే సరికి పావని గాయాలతో మృతి చెందిందని తెలుసుకున్న వడ్డె వెంకటేష్ పావని వద్ద ఉన్న చిన్నారి కూతురుకు చాయ్ తీసుకువస్తానంటూ చెప్పి అక్కడి నుండి రైల్వే స్టేషన్కు వెళ్లి కర్నూల్ కు నిందితుడు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, డీసీపీ రాజేష్ ఆదేశాలతో ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో సీఐ విజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి కర్నూలు వద్ద నిందితుడు వడ్డె వెంకటేష్ ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. నిందితుడిని పట్టుకునేందుకు సీఐ విజయ్ కుమార్, డిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శరత్ కుమార్, సిబ్బంది కరుణాకర్, రఫి, మహేష్, రాజు సహకారంతో నిందితుడు వడ్డె వెంకటేష్ ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్ కు తరలించటన్లు తెలిపారు..

## కూసుమంచిలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు...

**సికె న్యూస్ ప్రతినిధి కూసుమంచి**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే పాలేరు నియోజకవర్గం కేంద్రం కూసుమంచిలో సెమీ క్రిస్మస్ వేడుకలు...

పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వంచే నిర్వహించబడుతున్న సెమీ క్రిస్మస్ వేడుకలలో తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహనిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లా వ్యక్తిగత సహాయకులు తుంబూరు దయాకర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని పాలేరు నియోజకవర్గం నాలుగు మండలాల దైవజనులు మరియు క్రైస్తవ సోదరులు సోదరీమణులకు క్రిస్మస్ సందర్భంగా... క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం కేక్ కట్ చేయటం జరిగింది. అలాగే తెలంగాణ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన విందులో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రమేష్ నాయక్ గారు కూసుమంచి నేలకొండపల్లి ఖమ్మం రూరల్ తిరుమలయపాలెం మండలాల తాసిల్దార్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## తను రచించిన రాజ్యాంగం వల్లే ఈరోజు అమిత్ షా కేంద్రమంత్రిగా ఉన్నారు

- పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ గారి పై చేసిన వాక్యాలకు తక్షణమే క్షమాపణ చెప్పాలి
- మరోసారి అంబేద్కర్ గురించి రాజ్యాంగం గురించి మాట్లాడితే తగిన బుద్ధి చెప్తము ఖబర్దార్ అమిత్ షా
- షాద్ నగర్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు కోళ్ల మహేందర్



**సి కే న్యూస్ షాద్ నగర్ :డిసెంబర్ 21:** రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ను కేంద్రహోం మంత్రి అమిత్ షా వేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని,భేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎన్ ఎస్ యు ఐ నాయకులు కోళ్ల మహేందర్ డిమాండ్ చేశారు. అమిత్ షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకుని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కు, ఆయన సిద్ధాంతాలకు బీజేపీ వ్యతిరేకమని మండిపడ్డారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ను, ఆయన రచించిన రాజ్యాంగాన్ని గౌరవించకూడదని మనుస్మృతి, ఆర్ఎస్ఎస్ భావజాలం అమిత్ కు నేర్పుతోందన్నారు. దళితులను ఈసడించడమే పనిగా పెట్టుకున్న సంఘ్ పరివార్ దళితులకే కాదు, సామాజిక న్యాయం కోరుకునే వారందరికీ స్ఫూర్తి ప్రదాత డా. అంబేద్కర్ ను అవమానించడం చాలా సులువైన వ్యవహారంగా మారిందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో "అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్" అనడం ఫ్యాషన్ అయిపోయింది. ఇన్ని సార్లు భగవంతుడి పేరు తలిస్తే ఏడు జన్మల దాకా స్వర్గ ప్రాప్తి కలిగేది" అని అన్నారన్నారు. అమిత్ షా అంబేద్కర్ మీద చేసిన వ్యాఖ్యలు బీజేపీ, ఆర్.ఎస్.ఎస్.కు త్రివర్ణ పతాకం మీద, అశోకచక్రం మీద విశ్వాసం లేదని నిరూపించాయన్నారు. సంఘ్ పరివార్ అంబేద్కర్ ప్రధాన పాత్ర పోషించి రూపొందించిన భారత రాజ్యాంగం మీద ఇసుమంత గౌరవం కూడా లేదని అనేకసార్లు రుజువైందన్నారు. ఆర్.ఎస్.ఎస్. కార్యాలయం మీద 50 ఏళ్లపాటు త్రివర్ణ పతాకం ఎగురవేయడానికి నిరాకరించిందని, గాంధీ హత్య తరవాత అప్పుడు కేంద్ర హోం మంత్రిగా ఉన్న సర్దార్ పటేల్ ఆర్.ఎస్.ఎస్. ను నిషేధించారని గుర్తుచేశారు. తర్వాత అనేక వాగ్దానాలు చేస్తేనే గాని ఆర్.ఎస్.ఎస్. మీద నిషేధం తొలగలేదన్నారు. భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని ఆర్.ఎస్.ఎస్. హామీ ఇవ్వవలసి వచ్చిందన్నారు.ఆ ఆర్ ఎస్ ఎస్ నుంచి వచ్చిన అమిత్ షా నోటికొచ్చినట్టు అంబేద్కర్ అని అయిదుసార్లు అని ప్రతిపక్షాల మీద విరుచుకుపడ్డారని, అమిత్ షా ప్రతిపక్షాలను దుయ్యబట్టడానికే ఈ మాట ప్రస్తావించి ఉండవచ్చు. కానీ ఈ క్రమంలో అంబేద్కర్ నూ తీవ్రంగా అవమానించారన్నారు.

## తోమాలపల్లి గ్రామం లో రక్తదాన శిబిరం.



**పెబ్బేరు డిసెంబర్21 (సి కే న్యూస్)** పెబ్బేరు మండల పరిధిలోని తోమాలపల్లి గ్రామంలో శనివారం గ్రామ మాజీ ఉపసర్పంచ్ కీర్తిశేషులు నరేందర్ రెడ్డి జ్ఞాపకార్థం సందర్భంగా,ఎస్వీఎస్ హాస్పిటల్ సహకారంతో, మెగా రక్త శిబిరం, మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని తోమాలపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ తోక నరేష్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఇట్టి కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు, యువకులు,విజయవంతంగా చేయడానికి కృషి చేశారని నిర్వాహకుడు బోయ ఆనంద్ తెలియజేశారు.ఎస్వీఎస్ ఆసుపత్రి వైద్యులకు గ్రామ మాజీ ఉపసర్పంచ్ కీర్తిశేషులు నరేందర్ రెడ్డి భార్య హారిక వైద్యులను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమం లో తోమాలపల్లి గ్రామానికి చెందిన 26 మంది యువకులు రక్తదానం చేశారు.మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పెద్దలు మరియు గ్రామ యువకులు ధర్మారెడ్డి, వెంకట్రాంరెడ్డి ,మధు,మొగులన్న,గుడిసె వసంత్, రంగన్న, ప్రకాష్ ,భరత్, రాముల యాదవ్, కృపాకర్ రెడ్డి ,బీచుపల్లి,మహేష్, కేశవర్ధన్ రెడ్డి,లాలు,సురేష్,దులేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయస్వామి గోశాల ఒక ట్రాక్టర్ గడ్డి ప్రధానం

- గోమాత సకల దేవతలతో సమానం
- కొల్లూరు బాలరాజ్ హరిబాబు షాద్ నగర్ వాస్తవ్యులు



**సి.కె న్యూస్ షాద్ నగర్ : డిసెంబర్ 21:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో సోలిపూర్ శ్రీ చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ గోశాలలో గోవులకు కోసం ఒక ట్రాక్టర్ వరిగడ్డి గడ్డిని షాద్ నగర్ వాస్తవ్యులు

కొల్లూరు బాలరాజ్ హరిబాబు ప్రధానం చేయండి జరిగింది. అలాగే గోరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు కోరారు. అలాగే సకల దేవతలు ని లయమ్మైన గోమాత గోశాలయందు ఎంతో పుణ్యం చేసుకుంటే కానీ ఈ అవకాశం మనకు రాదు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సకల దేవతలకు శుభాశీస్సులు పొందండి.

శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ గోశాలలో ఆవులు కోసం. ఒక ట్రాక్టర్ వరిగడ్డి దానం చేసిన కొల్లూరు బాలరాజ్ హరిబాబులను 6 వార్డు కౌన్సిలర్ లత శ్రీ శ్రీశైలం గౌడ్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు...